బుధవారం
04-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 75
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అమెరికా రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తెలుగువారు మృతి

టెక్సాస్: అమెరికాలోని టెక్సాస్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృత్యువాతపడ్డారు. ఇందులో ముగ్గురు హైదరాబాద్ వాసులు ఉన్నారు. మరో వ్యక్తి చెన్నైవాసి అని తెలిసింది. రోడ్డుపై వెళ్తున్న ఐదు వాహనాలు ఒకేసారి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన మృతుల పేర్లు రఘునాథ్, లోకేశ్, ఫరూక్ షేక్, కాగా చెన్నై వాసి పేరు దర్శిని వాసుదేవన్ అని నిర్ధారణ అయింది. తెలుగు వారిలో ఒకరు కూకట్‌పల్లి వాసి ఉన్నట్టు సమాచారం. టెక్సాస్ రాష్ట్రంలోని అన్నెలో శు క్రవారం మధ్యాహ్నం ఈ ఘోర ప్రమాదం జరిగింది.

9 మంది మావోయిస్టుల మృతి

పోలీసుల కాల్పులతో దద్దరిల్లిన దండకారణ్యం

విశాలాంధ్ర- చింతూరు (అల్లూరి జిల్లా) : చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దండకారణ్యం పోలీసుల కాల్పులతో దద్దరిల్లింది. పచ్చని అటవీ ప్రాంతం రక్తసిక్తమైంది. మంగళవారం ఉదయం దంతెవాడ-బీజాపూర్ సరిహద్దుల్లోని బైరన్‌గడ్-సీమవర్తి, పశ్చిమ బస్తర్‌లోని దండకారణ్యంలో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ రెండు బృందాలుగా విడిపోయి గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. మావోయిస్టులు

- మిగతా 2 లో

'అపరాజిత'కు బెంగాల్ అసెంబ్లీ ఆమోదం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన నేపథ్యంలో మమతా బెనర్జీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హత్యాచార నిరోధక బిల్లును మమత ప్రభుత్వం మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. 'అపరాజిత విమెన్ అండ్ చైల్డ్ బిల్లు' పేరిట దానిని తీసుకువచ్చింది. ఇందుకోసం అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసింది. బిల్లుపై విస్తృత చర్చ జరిగింది. అనంతరం బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. ముఖ్యమంత్రి మమత మాట్లాడుతూ ఈ బిల్లు చరిత్రాత్మకమని వ్యాఖ్యానించారు. 'కోల్‌కతా వైద్యురాలి హత్యాచారం కేసుకు సంబంధించి సీబీఐ నుంచి న్యాయం కోరుతున్నాం. దోషులకు

- మిగతా 2 లో

సీబీఐ కస్టడీకి సందీప్ ఘోష్

కోల్‌కతా: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆసుపత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ అవినీతి వ్యవహారం తీవ్ర దుమారం రేపింది. వైద్య కళాశాలలో ఆర్థిక అవకతవకలకు పాల్పడిన కేసులో ఇప్పటికే సీబీఐ ఆయనను అరెస్టు చేయగా... తాజాగా కోర్టు ఎనిమిది రోజుల కస్టడీకి అప్పగించింది. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అమ్మేదెవ్వడు... కొనేదెవ్వడు

విశాఖలో కదం తొక్కిన కార్మిక వర్గం

ప్రాణాలర్పించైనా విశాఖ ఉక్కును కాపాడుకుంటాం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విశాఖ సాగర తీరంలో కార్మికులు కెరటాల వలే ఎగిసిపడి కదం తొక్కారు. కార్మిక హక్కులకు భంగం కలిగిస్తే ఖబడ్దార్ అంటూ నినదించారు. విశాఖ ఉక్కును అమ్మేదెవ్వడు ... కొనేదెవ్వడు, ప్రాణాలు అర్పించైనా పరిశ్రమను కాపాడుకుంటామని ఉద్యమకారులు ప్రతిజ్ఞ చేశారు. ఏఐటీయూసీ జాతీయ సమావేశాలు ముగింపు రోజైన మంగళవారం మధ్యాహ్నం విశాఖ నగర వీధుల్లో ఎర్రజెండాలతో కార్మిక ప్రదర్శన ప్రజలను ఆకట్టుకునేలా సాగింది. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఏఐటీయూసీ శ్రేణులు కదంతొక్కారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, లేబర్ కోడ్ లను రద్దు చేసి పాత చట్టాలని కొనసాగించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాలను రద్దు చేయాలని, ఏపీ ప్రభుత్వం కార్మికులకు సంక్షేమ బోర్డులను పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. సరస్వతి పార్కు జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీకి వేలాది

- మిగతా 2 లో

ఐక్య పోరుతో హక్కుల రక్షణ

విశాఖ బహిరంగ సభలో రామేంద్రకుమార్, అమర్‌జిత్ కౌర్ పిలుపు 6లో

విజయవాడ వైఎస్సార్ కాలనీలో వరద దృశ్యం

కబేళా రోడ్డులో...

సింగ్‌నగర్‌లో...

రేపు మరో అల్పపీడన ద్రోణి

కృష్ణా, గుంటూరు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం : భారీ వర్షాలు, వరదలు రాష్ట్ర ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఇంకా వరద ముంపులోనే ఉన్న విజయవాడలోని అనేక ప్రాంతాలు నాలుగు రోజులుగా తిండి, నీరు లేక అల్లాడిపోతున్నారు. ఇప్పుడిప్పుడే వర్షాలు తగ్గి వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరం అవుతున్న తరుణంలో విశాఖపట్నం వాతావరణ కేంద్రం

- మిగతా 2 లో

వరద తగ్గుముఖం

వరద తెచ్చిన తంటా...

సహాయ చర్యలు వేగవంతం

- వరద ముంపులోనే లక్షలాది మంది
- బాధితుల్లో విషాదఛాయలు
- ప్రకాశం బ్యారేజీకి, బుడమేరుకు తగ్గిన వరద

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రెండు రోజులుగా విజయవాడను గడగడలాడించిన బుడమేరు, కష్ణానది వరద తగ్గుముఖం పట్టింది. ప్రకాశం బ్యారేజీ నుంచి వరద ఉధృతి తగ్గింది. అటు బుడమేరు కూడా శాంతించింది. దీంతో మంగళవారం ప్రభుత్వం సహాయ చర్యలను వేగవంతం చేసింది. నిన్న, మొన్న బాధితులకు పెద్దగా అందని ఆహారం, మంచినీరు, పాలు వంటి సదుపాయాలు చాలావరకు బాధితులకు చేరింది. ప్రభుత్వ యంత్రాంగం సైతం సహాయ చర్యలను వేగవంతం చేసింది. ఎన్‌డీఆర్‌ఎఫ్,

- మిగతా 2 లో

ఇక ఉపేక్షించను

మానవత్వంతో పనిచేయాలి

నిర్లక్ష్యపు అధికారులపై చర్యలు తప్పవు: చంద్రబాబు

భవానీపురంలో...

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితులకు ఆహారం అందజేస్తున్నామని, అందరూ మానవత్వంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. వరద ముంపు బాధితులకు సాయం అందించేందుకు అన్ని వర్గాలు ముందుకు రావాలన్నారు. విజయవాడలోని ఎన్టీఆర్‌జిల్లా కలెక్టరేట్‌లో చంద్రబాబు మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరద ముంపు బాధితుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని చంద్రబాబు తేల్చిచెప్పారు. ప్రజలు చెల్లించే పన్నుల నుంచి జీతాలు తీసుకుంటున్న విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ఇంకా చాలామంది అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. సమాజానికి తప్పుడు సంకేతాలు ఇచ్చి పరువు పోగొట్టుకోవద్దని, సమాజ హితం కోసం అందరూ పని చేయాలని కోరారు. వీఆర్‌లో పెడితే

- మిగతా 2 లో

- ఏపీ, తెలంగాణలో ప్రధాని పర్యటించాలి
- హైడ్రా తరహాలో ఏపీలో కాల్వలు, చెరువులు పరిరక్షించాలి
- ప్రకాశం బ్యారేజీని పరిశీలించిన సీపీఐ నేతలు రామకృష్ణ, ముప్పాళ్ల

ఇది జాతీయ విపత్తే

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/తాడేపల్లి/మంగళగిరి: వందేళ్లలో ఏన్నడూ సంభవించని వరద ప్రళయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలనీ, ప్రధాని మోదీ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ఏపీ, తెలంగాణను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాలువలు, చెరువులు, నీటిపారుదల

- మిగతా 2 లో

బందీల కాల్చివేతపై ఆగ్రహం

జెరుసలేం: హమాస్ చెరలోని ఆరుగురు బందీల మృతదేహాలు రఫాలోని ఓ సొరంగంలో లభ్యం కావడంతో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. దీనిపై హమాస్ సరికొత్త ఆదేశాలు జారీ చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇజ్రాయిల్ దళాలు తమ స్థావరాల వద్దకు దూసుకొచ్చినప్పుడు అక్కడున్న బందీలతో ఎలా వ్యవహరించాలనే దానికి సంబంధించి సూచనలు రూపొందించినట్లు హమాస్ ప్రతినిధి వెల్లడించారు. వాటిని ఇప్పటికే జారీ చేసినట్లు తెలిపారు. జూన్‌లో నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో ఇజ్రాయిల్ నలుగురు బందీలను రక్షించింది. ఆ క్రమంలో 274 మంది పలస్తీనావాసులు ప్రాణాలు కోల్పోయారు. అప్పుడే ఆ సూచనలు రూపొందించినట్లు చెప్పారు. 'ఆ ఘటన తర్వాత ఖైదీల బాధ్యతలు చూస్తోన్న ముజాహిద్దీన్‌లకు ఈ ఆదేశాలు ఇచ్చాం. బందీలను ఉంచిన స్థావరాల వద్దకు ఇజ్రాయిల్ సైన్యం వస్తే... ఎలా వ్యవహరించాలో వాటిలో వివరించాం' అని తెలిపారు. అయితే వాటికి సంబంధించి ఎలాంటి వివరణ ఇవ్వలేదు. బందీల మరణాలపై హమాస్ నేత ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును విమర్శించారు. ఆయన చర్చలకు బదులుగా సైనిక చర్యనే కొనసాగిస్తున్నారని వ్యాఖ్యానించారు. సైనిక ఒత్తిడి ద్వారా బందీలను విడిపించాలని ఆయన పట్టుబడుతున్నారన్నారు. వారు సజీవంగా రావాలా..? నిర్జీవంగా రావాలా..? అనేది బందీల కుటుంబాలే తేల్చుకోవాలని బెదిరింపులకు పాల్పడ్డారు. ఇదిలాఉంటే... నెతన్యాహుకు వ్యతిరేకంగా సోమవారం ఇజ్రాయిల్‌లో భారీ ప్రదర్శనలు జరిగాయి. కాల్పుల విరమణకు అంగీకరించాలని, హమాస్ చెరలోని బందీలను సురక్షితంగా రప్పించాలని డిమాండ్ చేస్తూ టెల్ అవీవ్ వీధుల్లో ఆందోళనకారులు కదం తొక్కారు. దేశంలోని అతిపెద్ద కార్మిక సంఘం హిస్టాడ్రుట్ ఇచ్చిన ఒకరోజు సార్వత్రిక సమ్మె పిలుపునకు భారీ స్పందన లభించింది. ఈ సమ్మెపై ఇజ్రాయిల్ ప్రధాని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది పరోక్షంగా హమాస్‌కు మద్దతివ్వడమేనంటూ ధ్వజమెత్తారు. 'సిగ్గు చేటైన విషయం. సిన్వర్ (హమాస్ అగ్రనేత)... నువ్వు ఆరుగురిని హత్య చేశావు. అందుకు మేం మద్దతిస్తున్నాం' అని సమ్మె పిలుపుతో చెబుతున్నట్లు ఉందని వ్యాఖ్యానించారు. గాజా-ఈజిప్టు సరిహద్దు నుంచి సైన్యాన్ని ఉపసంహరించబోమని నెతన్యాహు తేల్చి చెప్పారు.

భారత్ వ్యతిరేకితో యూనస్ మంతనాలు

ఢాకా: బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్... అతివాద సంస్థ హెఫాజత్-ఎ-ఇస్లాం నాయకుడు మమునుల్ హక్, అతని గ్రూప్ సభ్యులతో సమావేశమయ్యారు. దీనికి సంబంధించిన దృశ్యాలు ఆన్‌లైన్‌లో వెలుగులోకి వచ్చాయి. మమునుల్ హక్... రెచ్చగొట్టే ప్రకటనలు చేయడంతో పాటు భారత వ్యతిరేక వైఖరి అనుసరిస్తుంటారు. అలాంటి నేతతో యూనస్ సమావేశం కావడం, ఎన్నికల గురించి చర్చించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల బంగ్లా రాజధాని ఢాకాలో ఈ సమావేశం జరిగింది. హింసను ప్రేరేపిస్తున్నారన్న ఆరోపణలతో కొన్ని అభియోగాల కింద మనుముల్ హక్‌ను మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వం జైలులో బంధించింది. అయితే రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలతో ఆమె ఇటీవల గద్దె దిగాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. అనంతరం ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం... హక్‌తో పాటు అనేకమంది అతివాద నేతలను విడుదల చేసింది. ఇప్పుడు వారితోనే యూనస్ సమావేశమయ్యారు. ఎన్నికల సంస్కరణలు, సకాలంలో ఎన్నికల నిర్వహణ వంటి అంశాలను వారితో చర్చించారు. ఇదిలాఉంటే... బంగ్లాదేశ్‌లో భారత్ వ్యతిరేకిగా పేరొందిన మతతత్వ పార్టీ జమాతే ఇస్లామీపై హసీనా విధించిన నిషేధాన్ని కూడా ఎత్తివేసిన సంగతి తెలిసిందే. జమాతేకు మతతత్వ పార్టీగా పేరుంది. రాజకీయ కారణాలతోనే జమాతే ఇస్లామీపై హసీనా ప్రభుత్వం నిషేధం విధించిందని, అందుకే దాన్ని ఎత్తివేస్తున్నామని ప్రస్తుత ప్రభుత్వం వెల్లడించింది. మరోవైపు భారత్- బంగ్లా సంబంధాలపై జమాతే ఇస్లామీ అధినేత షఫీకుర్ రహమాన్ మాట్లాడుతూ భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలనే తాము కోరుకుంటున్నామని తెలిపారు. అయితే ద్వైపాక్షిక సంబంధాల పేరుతో ఇతర దేశాల అంతర్గత అంశాల్లో జోక్యం చేసుకోవడం భారత్ మానుకోవాలన్నారు. అమెరికా, చైనా, పాకిస్థాన్‌తోనూ బంగ్లా సన్నిహిత సంబంధాలు నెరపాలని రహమాన్ తెలిపారు.

'అపరాజిత'కు బెంగాల్ అసెంబ్లీ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

మరణశిక్ష విధించాలని భావిస్తున్నాం. ఈ రోజు మేం ప్రవేశపెట్టిన బిల్లుపై గవర్నర్ సంతకం చేయాలని విపక్షాలు అడగాలి. ఆ తర్వాత దానిని అమలు చేసే బాధ్యత మాది. ఈ బిల్లు ద్వారా కేంద్రచట్టంలోని లోపాలు సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. సత్వర విచారణ, బాధితులకు న్యాయం లభించడం ఈ బిల్లు లక్ష్యం. ఒకసారి ఈ బిల్లు ఆమోదం పొందితే... ప్రత్యేక అపరాజిత టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తాం. అత్యాచారం వంటి దారుణాలు మానవాళికి శాపాలు. ఇలాంటి ఘోరాలు జరగకుండా సామాజిక సంస్కరణలు రావాలి. యూపీ, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో మహిళలపై అసాధారణ స్థాయిలో నేరాలు జరుగుతున్నాయి. ఉన్నావ్, హత్రాస్ కేసుల్లో న్యాయం గురించి ఎవరూ మాట్లాడటం లేదు. కానీ బెంగాల్‌లో మహిళలకు కోర్టుల్లో న్యాయం లభిస్తుంది. మీవలే నేనూ ప్రధాని, హోంమంత్రిపై నినాదాలు చేస్తే ఎలా ఉంటుంది? మహిళ రక్షణ కోసం సమర్థవంతమైన చట్టాలు తీసుకురాలేని ముఖ్యమంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేయండి' అని మమత డిమాండ్ చేశారు. మృతురాలికి నివాళి అర్పించారు. హత్యాచార ఘటనపై మమత ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తోన్న విపక్షాలు సైతం ఈ బిల్లుకు మద్దతిచ్చాయి.

9 మంది మావోయిస్టుల మృతి

(మొదటిపేజీ తరువాయి)

తారసపడగానే ఉదయం 10.30 నుంచి కాల్పులు ప్రారంభించారు. ఈ కాల్పుల్లో 9 మంది సాయుధ మావోయిస్టులు మృతి చెందారు. మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో మావోయిస్టు అగ్ర నేతలు ఉన్నట్లు సమాచారం. వారి వద్ద ఉన్న ఎస్ఎల్ఆర్, 303, 315 రైఫిళ్లు, మారణాయుధాలు, మావోయిస్టు సామాగ్రిని భారీఎత్తున పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు ఉన్నతాధికారి ధ్రువీకరించారు. చత్తీస్‌గఢ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శర్మ ఈ సందర్భంగా పోలీసులకు, సీఆర్‌పీఎఫ్ జవాన్లకు అభినందనలు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు త్వరలోనే పూర్తిగా అంతమవుతారని పేర్కొన్నారు.

సీబీఐ కస్టడీకి సందీప్ ఘోష్

(మొదటిపేజీ తరువాయి)

హత్యాచార ఘటన దర్యాప్తులో సీబీఐ వేగం పెంచింది. ఈ కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న సందీప్ ఘోష్‌ను సోమవారం అరెస్టు చేసింది. ఆసుపత్రి ఆర్థిక వ్యవహారాల్లో అవకతవకలకు సంబంధించి ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించింది. గత నెల 9న చోటుచేసుకున్న హత్యాచార ఘటనపై ఘోష్‌ను సీబీఐ 15 రోజుల పాటు ప్రశ్నించింది. సోమవారం విచారణ అనంతరం ఇక్కడి అవినీతి నిరోధక విభాగానికి తరలించి... అరెస్టు చేసినట్లు ప్రకటించింది. ఈ కేసులో ఇంతకుముందు పోలీస్ పౌర వలంటీర్ సంజయ్ రాయ్‌ని అరెస్టు చేయగా ఇప్పుడిది రెండో అరెస్టు. అనాథ శవాలు అమ్ముకోవడంతోపాటు ఆసుపత్రి టెండర్లలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ఘోష్‌పై ఆరోపణలున్నాయి. ఆ వ్యవహారాల గురించి వైద్యురాలికి తెలిసినందునే ఆమెపై అఘాయిత్యానికి ఒడిగట్టారా అనే కోణంలో సీబీఐ దర్యాప్తు చేస్తోంది.

రేపు మరో అల్పపీడన ద్రోణి

(మొదటిపేజీ తరువాయి)

కీలక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 5న పశ్చిమ మధ్య, వాయువ్య బంగాళాఖాతంను ఆనుకొని మరో అల్పపీడనం ఏర్పడనుందని ప్రకటించింది. రుతుపవన ద్రోణి ప్రభావంతో ఉపరితల ఆవర్తనం కోస్తా మీదుగా కొనసాగుతోందని, రాష్ట్రంలో చెదురు మదురుగా వర్షాలు పడతాయని, ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. కృష్ణా, గుంటూరులో ఓ మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. ఈ రెండు జిల్లాలకు ప్రస్తుతం ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తున్నట్లు వివరించింది.

అమ్మేదెవ్వడు .. కొనేదెవ్వడు

(మొదటిపేజీ తరువాయి)

మంది కార్మికులు తరలివచ్చారు. ర్యాలీ అగ్రభాగాన ఏఐటీయూసీ జాతీయ అధ్యక్ష కార్యదర్శులు రామేంద్ర కుమార్, అమర్ జీత్ కౌర్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావులపల్లి రవీంద్రనాథ్, జి ఓబులేసు, జాతీయ ఉపాధ్యక్షులు డి ఆదినారాయణతో పాటు అనేక మంది నేతలు కార్యకర్తలు, కార్మికులు ర్యాలీలో తమ హక్కుల రక్షణకై నినాదాలు చేస్తూ నినదించారు.

సరస్వతి పార్క్ నుంచి దాబా గార్డెన్స్ మీదుగా, అంబేద్కర్ సర్కిల్, ఎల్ఐసి కార్యాలయం, గుడివాడ జంక్షన్ మీదుగా జీవీఎంసీ వద్ద గల గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకుంది. ర్యాలీలో అరకు దింసా నృత్యం ఆకట్టుకుంది. రెడ్ షర్ట్ వాలంటీర్లు కవాతు అందర్నీ ఉత్సాహపరిచింది. డప్పుల మోత, డీజే లతో కార్మిక, యువత నృత్యాల మధ్య ఈ కార్మిక ప్రదర్శన ఉప్పొంగిన ఉత్సాహంతో ముందుకు సాగింది. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెట్టొద్దన్న నినాదాలు హోరెత్తాయి. విశాఖలో జరుగుతున్న ఫార్మా పరిశ్రమలపై శవయాత్ర అందర్నీ ఆకట్టుకుంది. పరిశ్రమల్లో భద్రత కరువై కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని, ప్రభుత్వాలు పరిశ్రమల యజమానులకు తొత్తులుగా మారి కార్మిక హక్కులను, వారి ప్రాణాలకు రక్షణ లేకుండా చేస్తున్నారని ఈ ప్రదర్శనలో కార్మికులు పెద్ద ఎత్తున నినదించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ జోలికొస్తే కార్మిక వర్గం ఊరుకోదని హెచ్చరించారు.

ఈ ర్యాలీలో వివిధ జిల్లాలకు చెందిన ఏఐటీయూసీ శ్రేణులతో పాటు అనుబంధ సంఘాలైన అల్యూమినియం వర్కర్స్ యూనియన్, ఏపీ స్వచ్ఛాంధ్ర క్లాప్ వెహికల్స్ డ్రైవర్స్ యూనియన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్, బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్, సివిల్ సప్లైస్ హమాలీ వర్కర్స్ యూనియన్, విశాఖ ఆటో, రిక్షా, మోటారు వర్కర్ల సంఘం, ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, మత్స్య కార్మిక సంఘం, వీధి విక్రయదారుల కర్షక ఫెడరేషన్, గిరిజన కార్మిక సంఘం, ఆర్టీసీ లైసెన్స్ పోర్టర్స్ యూనియన్, వాల్తేర్ రైల్వే వర్కర్స్ యూనియన్ తదితర అనేక సంఘాల శ్రేణులు పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. పైడి రాజు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎం మన్మధరావు, ప్రధాన కార్యదర్శి జి అచ్యుతరావు, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, నాయకులు ఎం భద్రం, రాజబాబు, అల్లూరి జిల్లా కార్యదర్శి అమర్, విజయనగరం జిల్లా కార్యదర్శి బుగత అశోక్, నాయకులు రంగరాజు, శ్రీకాకుళం జిల్లా నాయకులు షణ్ముఖరావు, గోవింద్, కాకినాడ జిల్లా నాయకులు తోకల ప్రసాద్, విశాఖ జిల్లా నేతలు కసిరెడ్డి సత్యనారాయణ, బూసీ వెంకట్రావు, కె సత్యాంజనేయ, జేడీ నాయుడు, ఎస్ కే రెహమాన్, జి వామన మూర్తి తదితరులు ప్రదర్శనకు నాయకత్వంవహించారు.

ఇక ఉపేక్షించను

(మొదటిపేజీ తరువాయి)

పనిచేయరా?, జీతం తీసుకోవడం లేదా? ప్రజలు ఉంటేనే మనం ఉంటామని సీఎం స్పష్టంచేశారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే కొందరు మీనమేషాలు లెక్కిస్తున్నారని మండిపడ్డారు. తాను వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, బాధితులకు సాయం అందించాలని ఆదేశించినా క్షేత్రస్థాయిలో కొందరు అధికారులు పనిచేయడం లేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. హుదూద్ సమయంలో తాను చేసిన సేవలను నాడు ప్రధాని అభినందించారని గుర్తుచేశారు. ఈ వరదలతో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ఇక్కడే ఉండి పనిచేస్తున్నామని స్పష్టంచేశారు. మూడు రోజులు బిడ్డకు పాలు అందకపోతే ఏ తల్లిదండ్రులైనా బాధపడతారని, అందుకే మానవతా దృక్పథంతో పని చేయాలని ఆదేశించారు. అధికారులు తీరు మార్చుకోకపోతే...తన విశ్వరూపాన్ని చూస్తారని సీఎం హెచ్చరించారు. ప్రకాశం బ్యారేజీ గేట్ల దగ్గరకు బోట్లు కొట్టుకువచ్చిన ఘటనపై విచారణకు ఆదేశిస్తామన్నారు. విపరీతంగా వచ్చిన వరదతో మూడు రోజులుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వారిని ఆ ఇబ్బందుల నుంచి బయటకు తెచ్చేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నామని అన్నారు. ఆరు హెలికాప్టర్లు, 30 డ్రోన్లు తెప్పించి బాధితులకు ఆహారం అందజేస్తున్నామని వివరించారు. 179 సచివాలయాల పరిధిలో...ఒక్కో సచివాలయానికి ఒక సీనియర్ అధికారిని నియమించామని, బాధితుల కోసం ట్రాక్టర్లు, వ్యాన్లు, పొక్లెయిన్లు, బోట్లు ఏర్పాటు చేశామన్నారు. 32 మంది ఐఏఎస్ అధికారులు విధుల్లో ఉన్నారని, 10 జిల్లాల నుంచి బాధితుల కోసం ఆహారం తెప్పిస్తున్నామని చెప్పారు. చివరి బాధితుడి వరకూ సాయం అందిస్తామన్నారు. గడచిన రెండు రోజులపాటు బాధితులు ఇబ్బందులకు గురయ్యారని, ఇక ఇబ్బంది పడటానికి

అవకాశం ఉండకూడదన్నారు. ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని, వాటిని పాటించకపోతే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోనన్నారు. ప్రతి ఇంట్లోకి నీళ్లతో పాటు పాములు వచ్చి చేరుతున్నాయని, దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని సీఎం చెప్పారు. ప్రతి కుటుంబం బాధలో ఉందని, మానవతా దృక్పథంతో పనిచేద్దామని, విపత్కర పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కోరారు. చెత్త రాజకీయాలు చేయకుండా ప్రజాహితం కోసం పనిచేయాలన్నారు. ఆపద సమయంలో సహాయక చర్యలకు భంగం కలిగించి ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవాలని కుట్రలు జరుగుతున్నాయని, వాటి ద్వారా సాధించేదేమీ లేదన్నారు. ఇప్పటికే విధుల్లో నిర్లక్ష్యం వహించిన కొందరు అధికారులకు షోకాజ్ నోటీసులు పంపించామని, జక్కంపూడిలో ఓ అధికారిపై చర్యలు తీసుకున్నామని సీఎం వెల్లడించారు. వర్షం పడి ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే గుడ్లవల్లేరు కాలేజీలో సమస్య అంటూ మాట్లాడటాన్ని సీఎం తప్పుపట్టారు. సిగ్గుంటే ఇలా మాట్లాడతారా.? రాజకీయ ముసుగులో నేరస్తులుగా ఉండేవారు తమ దృష్టి మళ్లించేందుకు, ప్రజలను ఇబ్బందులకు గురిచేసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. వరద ముంపు ప్రాంతాలకు వచ్చిన జగన్ ఐదు నిమిషాల్లో తిరిగి వెళ్లిపోయాడని విమర్శించారు. కనీసం ఒక్కరికైనా ఒక పొట్లం ఆహారమైనా అందించారా... ఒక్కరినైనా రక్షించారా... కనీసం పలకరించారా అని ప్రశ్నించారు.

ఇది జాతీయ విపత్తే

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థ పరిరక్షణకు హైడ్రా తరహా చర్యలకు పూనుకోవాలన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, పార్టీ నేతలతో కలిసి మంగళవారం ప్రకాశం బ్యారేజీ గేట్లను రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకించి తెలంగాణలో ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో అతి భారీ వర్షాలకు ప్రాజెక్టుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఇంజినీరింగ్ అధికారులు సకాలంలో స్పందించలేదన్నారు. భారీ వర్షాలు కురవబోతున్నాయని వాతావరణ శాఖ స్పష్టంగా ప్రకటించినప్పటికీ ముందస్తు చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. ఆల్మట్టి డ్యామ్ మొదలుకొని అన్ని ప్రాజెక్టులు నిండుగా ఉన్నాయని, తుంగభద్ర ప్రాజెక్టు నిండుగా ఉందని, శ్రీశైలం డ్యామ్, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లో నీటి సామర్థ్యాన్ని తగ్గించి ఉంటే ప్రకాశం బ్యారేజీకి ఇంత ఉధృతి ఉండేది కాదన్నారు. వరద ప్రభావం తగ్గిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు దీనిపై పూర్తిగా సమీక్షించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రా ఏర్పాటు చేసి... ధైర్యంగా చెరువుల కబ్జాలను తొలగించడానికి పూనుకున్నారని, అలాంటి ధైర్యమైన నిర్ణయాన్ని మన ముఖ్యమంత్రి చంద్రబాబు చేయాలన్నారు. విజయవాడ నగరంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాల్లో ఎక్కడెక్కడ అయితే నాళాలు, చెరువులు, కాలువలు, వాగులపై కబ్జాలు జరిగాయో... వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రాష్ట్రంలో హైడ్రా తరహా చర్యలకు పూనుకోవాలని కోరారు. అధికారులు అప్రమత్తంగా లేకపోవడం వల్లే బోట్లు కొట్టుకువచ్చి బ్యారేజ్‌ని ఢీకొట్టాయని, ఇందులో అధికారుల వైఫల్యం స్పష్టంగా కనబడుతోందని చెప్పారు. ముఖ్యమంత్రి దీనిపై సీనియర్ ఈఎన్‌సీ ద్వారా సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఆల్మట్టి డ్యామ్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు అన్ని ప్రాజెక్టులలో నీరు ఎక్కువగా ఉండి, భారీ వర్షాలు వస్తున్నప్పుడు అధికారులు అప్రమత్తంగా ఎందుకు ఉండలేదని ప్రశ్నించారు. 2009లో శ్రీశైలం ప్రాజెక్టులో వరద నీరు విడుదల చేయనందువల్ల డ్యామ్ పైకి ఎక్కి పారిందని, దాని పర్యవసనంగా కర్నూలు మునిగిపోయిందని గుర్తుచేశారు. ఇప్పుడూ అదే జరిగిందని అధికారులు సకాలంలో స్పందించలేదని, బోట్లు కొట్టుకొస్తుంటే ఏం చర్యలు చేపట్టారో చెప్పాలన్నారు. తుంగభద్ర డ్యామ్‌లో గేటు ఏర్పాటు చేసిన జలవనరులశాఖ సలహాదారు కన్నయ్య నాయుడు లాంటి వారిని గౌరవించాలని సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వరద ప్రళయం లక్షలాది మందిని నిరాశ్రయులను చేసిందనీ, మూడు రోజులుగా వరద బాధితులు నీరు, ఆహారం, మందుల కోసం నిలువెత్తు నీటిలో అల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వరద బీభత్సాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని, ప్రధాని నరేంద్ర మోదీ ఏపీ, తెలంగాణలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని, తక్షణమే కేంద్రం నుంచి నిధులు విడుదల చేసి ఆదుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

ప్రకాశం బ్యారేజీకి సమాంతర బ్యారేజీ నిర్మించాలి: ముప్పాళ్ల

ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజీపై భారీ వాహనాల రాకపోకలను సుమారు 15 సంవత్సరాల క్రితం నిషేధించారని, గుంటూరు ప్రాంతం నుంచి విజయవాడకు వెళ్లవలసిన వారు ఎంతో ప్రయాసకు గురయ్యారని చెప్పారు. దీనిపై అఖిలపక్షంగా ఏర్పడి పెద్ద ఉద్యమం నడిపామని, ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రకాశం బ్యారేజీకి సమాంతరంగా కనీసం 14లక్షల నుంచి 15 లక్షల క్యూసెక్కుల సామర్థ్యంగల మరో బ్యారేజీ నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే, అమరావతి నుంచి ఉండవల్లి వరకు రెండు లైన్ల రహదారి ఏర్పాటు చేసి... రెండు వైపుల పార్కులు, పచ్చదనం పెంచి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. దీనిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ముప్పాళ్ల సూచించారు. అలాగే, ఉండవల్లి నుంచి రేపల్లె వరకు కరకట్టను డబుల్ రోడ్డుగా మార్చాలని, తుపానులు, వరదలు వచ్చినా ఆ రోడ్డు దెబ్బతినకుండా...ఇళ్లు, పంటపొలాలు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రతిపాదనలపై దృష్టి కేంద్రీకరించాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. అమరావతి సమీపంలోని వైకుంఠపురం వద్ద కరకట్ట బ్రేక్ అయి మద్దూరు వైపు నుంచి పొలాలమీదుగా వచ్చిన వరద వల్ల అమరావతికి ప్రమాదమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గజవల్లి వెంకట కృష్ణారావు, తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల కారణంగా ముంపుకు గురైన గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలోని రత్నాల చెరువు కాలనీని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావులతో కూడిన బృందం మంగళవారం పరిశీలించింది. నీట మునిగిన వీధులతో పాటు చేనేత మగ్గాలను వారు పరిశీలించారు. బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వలనే వర్షాలు వచ్చినప్పుడు సమస్యలు తలెత్తుతున్నాయని బాధితులు సీపీఐ నాయకులకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ, ముప్పాళ్ల మాట్లాడుతూ, మంగళగిరి రత్నాల చెరువు కాలనీ ప్రాంతంలో ఉన్న సుమారు 1500 మగ్గాలు గుంటల్లోకి నీళ్లు చేరి గత వారం రోజుల నుంచి పనులు లేకుండా పోయిన పరిస్థితి ఉందని అన్నారు. అయితే ఎప్పటికప్పుడు మోటర్లు పెట్టి నీటిని తోడించటం వలన కొంత ఉపశమనం జరిగినప్పటికీ చేనేత కార్మికుల వృత్తి సంక్షోభంలోకి నెట్టివేయబడిందన్నారు. పని కోల్పోయారని చెప్పారు. జీఓ 5 ప్రకారం చేనేత కార్మికులకు ఎంత నష్టం జరిగిందో దాన్ని పూర్తిస్థాయిలో ప్రభుత్వం భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మండల కార్యదర్శి జాన్ బాబు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, గంజి పట్టాభి, గంజి వెంకయ్య, బత్తుల గిరి, దొడ్డి ఈశ్వరరావు, బత్తూరి మోహనరావు, గజవల్లి వెంకటకృష్ణ, కాకర్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వరద తగ్గుముఖం

(మొదటిపేజీ తరువాయి)

ఎస్డీఆర్ఎఫ్, హెలికాప్టర్లు, డ్రోన్ల సాయంతో బాధితులకు చాలావరకు ఆహారం అందజేసింది. మరోవైపు, సర్వం కోల్పోయిన బాధితులు ఏమి చేయాలో తెలియని స్థితిలో ఉన్నారు. సర్వం కోల్పోయి... ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. ఇటు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు సైతం సహాయచర్యల్లో పాల్గొని బాధితులకు భరోసా కల్పిస్తున్నారు. కాగా, వరద ఉధృతి తగ్గినప్పటికీ బాధితులు ఇంకా బురదనీటిలో జీవిస్తున్నారు. ఇళ్ల నుంచి బయటికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. విజయవాడ నగరంలో వరద ముంపు ప్రాంతాల్లో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టింది. నాలుగు రోజుల నుంచి వరద ముంపులోనే ప్రజలు అల్లాడుతూ బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి... భయం గుప్పిట్లో బతుకుతున్నారు. ఇదే పరిస్థితి ఇప్పుడూ కనిపిస్తోంది. ఇళ్లలోనే చిక్కుకున్న బాధితులు కనీసం కాలకృత్యాలు తీర్చుకునే పరిస్థితి లేకుండా పోయింది. విద్యుత్ సరఫరా ఇంకా పునరుద్ధరణ జరగలేదు. బుడమేరు పరీవాహక ప్రాంతంలో ఇంకా వరద నీరు నిలిచే ఉంది. బాధితులు సగానికిపైగా ఇళ్లకే పరిమితమయ్యారు. కాలనీలు, రహదారులు చెరువుల్లా తలపించడంతో ఎటూ వెళ్లలేని దుస్థితి. వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, రోగగ్రస్తులు నానా అవస్థలు పడుతున్నారు.

ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సరిపడా ఆహార పొట్లాలు సమకూర్చినా... కొన్ని ప్రాంతాల్లో అందజేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని స్వయంగా సీఎం చంద్రబాబు మీడియా సమావేశంలో అంగీకరించారు. ఆహార సరఫరాలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం చూపుతోందని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరద ముంపు ప్రభావంలేని ప్రాంతాల వారికి ఆహారం సరఫరా చేయడం, అక్కడ వారు వృథాగా చెత్తలో పోస్తున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. బుడమేరుతో పాటు కృష్ణా పరీవాహక ప్రాంత ముంపులో దాదాపు 4 లక్షల మంది బాధితులు చిక్కుకున్నారు. ఇంకా ఇంట్లో నుంచి బయటకు రాకుండా 3 లక్షల మంది అవస్థలు పడుతున్నట్లు సమాచారం. ఒక్క సింగ్‌నగర్ పరిసర ప్రాంతంలోనే 2.76 లక్షల మంది ఉన్నట్లు అంచనా. విజయవాడ సింగ్‌నగర్, వన్‌టౌన్, వించిపేట ప్రాంతాలు వరద గుప్పెట్లోనే ఉన్నాయి. అజిత్‌సింగ్‌నగర్ డాబా కొట్ల సెంటర్ వద్ద ముంపులోనే ఓ ఇంట్లో మహిళ ప్రసవించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆమెను సురక్షిత ప్రాంతానికి తరలించారు. వరద సహాయక చర్యల్లో నిమగ్నమైన విద్యుత్ లైన్‌మెన్ వజ్రాల కోటేశ్వరరావు కొట్టుకుపోయి మృతి చెందారు. అటు లంక గ్రామాల చుట్టూ వరద నీరు ముంచెత్తింది. ఇప్పటివరకు ముంపు ప్రాంతాల నుంచి కేవలం 43,417 మందిని పునరావాస శిబిరాలకు తరలించినట్లు విపత్తుల కేంద్రం వెల్లడించింది. మరోవైపు, మున్నేరు వరద ఉధృతికి ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని లింగాల వంతెన కొట్టుకుపోయింది. దీంతో జగ్గయ్యపేట-ఖమ్మం మధ్య రాకపోకలు స్తంభించాయి. కిలోమీటర్లు పొడవునా గండ్లు పడ్డాయి. విజయవాడ మధురానగర్ సమీపంలోని విజయదుర్గానగర్‌లో బుడమేరు కాల్వకు గండిపడి ఏలూరు కాల్వలోకి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సమీప ప్రాంత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వరద ముంపు ప్రాంతాల్లో జేసీబీపై చంద్రబాబు పర్యటించారు. ప్రకాశం బ్యారేజీలో బోట్లు దూసుకొచ్చి గేట్లు దెబ్బతిన్న ప్రాంతాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, పార్టీ ఇతర నేతలు పరిశీలించారు.

కృష్ణానది ఉధృతి తగ్గుముఖం

భారీ వర్షాలు, వరదలతో ఉగ్రరూపం దాల్చిన కృష్ణానది కాస్త శాంతించింది. ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం క్రమక్రమంగా తగ్గుతోంది. 11 లక్షల 40 వేల క్యూసెక్కుల నుంచి గంట గంటకు

వరద తాకిడి తగ్గుముఖం పడుతోంది. మంగళవారం ఉదయం 8 లక్షల 94 వేల క్యూసెక్కులకు వరద చేరుకుంది. మరింతగా తగ్గే అవకాశాలున్నాయి. కృష్ణానది శాంతించడంతో బ్యారేజీ దిగువున ఉన్న గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. అటు కృష్ణాతీరంలోని గుంటూరు, బాపట్ల, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో అనేక గ్రామాలను వరద ముంపు వెంటాడుతోంది. ఇటు ప్రకాశం బ్యారేజ్ నుంచి నీటి విడుదల స్వల్పంగా తగ్గటంతో దివిసీమలోని అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలకు ముంపు ప్రమాదం నుంచి బయటపడే అవకాశాలు ఏర్పడ్డాయి. నాగాయలంక, శ్రీరామపాద క్షేత్రం ఘాట్ వద్ద అడుగు మేర వరద నీటిమట్టం తగ్గుతోంది. కరకట్టకు సమాంతరంగా నీరు ప్రవహించడంతో నదీ తీర గ్రామాల ప్రజలు రాత్రంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు. అవనిగడ్డ, మోపిదేవి, నాగాయలంక మండలాల్లోని లంక గ్రామాలు ఇంకా జల దిగ్బంధంలోనే ఉన్నాయి.

తగ్గిన బుడమేరు ప్రవాహం

జి.కొండూరు మండలం దగ్గర బుడమేరు ప్రవాహం తగ్గుతోంది. నిన్నటి వరకూ మహోగ్రరూపం దాల్చిన బుడమేరుకు మంగళవారం నుంచి వరద ఉధృతి తగ్గింది. బుడమేరు డిజైన్ సామర్థ్యం 15 వేల క్యూసెక్కులకు మించి వరద నీరు వచ్చి చేరింది. కుంభవృష్టి నమోదవడంతో బుడమేరు వరద విజయవాడలోని 16 డివిజన్లను ముంచెత్తింది. బుడమేరులో ప్రస్తుతం 6 వేల క్యూసెక్కులు మాత్రమే వరద ప్రవాహం ఉందని, అది మరింత తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాలకు 6 లక్షల ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ప్రకటించారు. వాటి సరఫరాకు అక్కడక్కడా అవాంతరాలు ఏర్పడుతున్నాయి. ఇదే సమయంలో మళ్లీ రెండు రోజులపాటు భారీ వర్షాలు, వరదలు ఉంటాయని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికతో బుడమేరు, కృష్ణాతీర ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. వరద నీరు తగ్గాక పారిశుద్ధ్యం పనులకుగాను 10 వేల మంది కార్మికులు అవసరమని అంచనా వేస్తున్నారు.

డ్రోన్ల ద్వారా బాధితులకు ఆహారం

సీఎం చంద్రబాబు పర్యవేక్షణ

ట్రాక్టర్ల ద్వారా మంత్రులు సరఫరా

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: విజయవాడ నగరంలో ముంపునకు గురైన ప్రాంతాల్లోని వరద బాధితులకు హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా ఆహారం, తాగునీరు, బిస్కెట్లు, పాలు, వంటి పదార్థాల పంపిణీకి ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు తీసుకుంది. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో భారత వాయుసేన ప్రత్యేక నేవీ హెలికాప్టర్లలో పంపిణీకి అధికారులు వాటిని సిద్ధం చేశారు. మరోవైపు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు పడవల ద్వారా ఆహార పొట్లాలు చేరవేస్తున్నాయి. పడవులు చేరుకోలేని ప్రాంతంలో డ్రోన్ల ద్వారా బాధితులకు ఆహారం అందిస్తున్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు వార్డుల వారీగా మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారులు నిమగ్నమయ్యారు. విజయవాడలోని ముంపు ప్రాంతాలకు హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రులు అచ్చెన్నాయుడు ట్రాక్టర్లతో వెళ్లి ఆహారం పంపిణీ చేశారు. వరద బాధితుల వద్దకు బీసీ సంక్షేమశాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి స్వయంగా ట్రాక్టర్ నడుపుకుంటూ వెళ్లి ఆహారం అందజేశారు. విపత్తుల సంస్థలోని కంట్రోల్ రూమ్ నుంచి 24 గంటలు 8 మంది ఐఏఎస్ అధికారులు నిరంతర పర్యవేక్షణలో ఉన్నారు. నేవీ హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా ఆహారం, నీరు, పాలు, పండ్లు, బిస్కెట్లు, మందుల పంపిణీకి ప్రణాళిక రూపొందించారు. వరద ముంపు బాధితులు 43,417మందిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు, 197వైద్యశిబిరాలను ఏర్పాటు చేసినట్టు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఇతర జిల్లాల నుంచి విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియానికి లారీల్లో ఆహార పొట్లాలు, పండ్లు, నీటి పొట్లాలు చేరుకున్నాయి. బాపట్లజిల్లా రేపల్లె మండలం పెనుమూడి పునరావాస కేంద్రాలను మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ సందర్శించారు. బాధితులకు అందుతున్న సేవలపై వారు ఆరా తీశారు.

వరద బాధితులకు పెద్దఎత్తున ఆహారం: మంత్రి నారాయణ

సీఎం చంద్రబాబు ఆదేశాలతో వరద బాధితులకు పెద్ద ఎత్తున ఆహారం పంపిణీ చేస్తున్నామని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ చెప్పారు. మంగళవారం ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో వరద ముంపు ప్రాంతాలకు ఆహార ప్యాకెట్ల పంపిణీని మంత్రి పరిశీలించారు. నారాయణ మాట్లాడుతూ, 3 లక్షల వాటర్ బాటిళ్లు కూడా బాధితులకు పంపిణీ చేశామని వెల్లడించారు. గుంటూరు, ఒంగోలు, ఏలూరు, భీమవరం, రాజహేంద్రవరం మున్సిపాలిటీలతో పాటు హరే కృష్ణ మూవ్‌మెంట్, వివిధ కంపెనీలకు ఆహారం తయారీ బాధ్యతలు అప్పగించామన్నారు. మొత్తం 6 లక్షల ఫుడ్ ప్యాకెట్లు, 6 లక్షల వాటర్ బాటిళ్లు, ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఆహారంతో పాటు అరటిపండ్లు, ఇతర ఫ్రూట్స్ కూడా బాధితులకు పంపినట్లు వివరించారు.వరద బాధితులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ప్రభుత్వ యంత్రాంగం అంతా విజయవాడలోనే ఉండి అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ముంపు బాధితుల కోసం సీఎం అహర్నిశలు శ్రమిస్తున్నారని, వార్డుల వారీగా మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారని చెప్పారు. వరద ముంపు ప్రాంతాల్లో శరవేగంగా ప్రభుత్వం సహాయక చర్యలు కొనసాగిస్తోందని, 6 హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా ఆహారం, నీరు, పాలు, పండ్లు, బిస్కెట్లు, మందులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ప్రాథమిక అవసరాలు అందించడానికి అగ్ర ప్రాధాన్యతనిస్తున్నారని మంత్రి నారాయణ చెప్పారు.

వరద బాధితులకు వైసీపీ రూ.కోటి విరాళం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వరద బాధితుల కోసం పార్టీ తరపున కోటి రూపాయల సాయం అందజేస్తున్నట్లు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. అది ఏ రూపంలో, ఎలా ఇవ్వాలనేది పార్టీ నాయకులతో చర్చించి... నిర్ణయం తీసుకుంటామన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో అందుబాటులో ఉన్న పార్టీ సీనియర్ నేతలు, ఎన్టీఆర్ జిల్లా పార్టీ నాయకులతో జగన్ మంగళవారం భేటీ అయ్యారు. కృష్ణానదికి భారీ వరదతో విజయవాడలో తలెత్తిన పరిస్థితిని జగన్ సమీక్షించారు. వరద ముంచెత్తిన ప్రాంతాల్లో ప్రభుత్వం ఎలాంటి సహాయ కార్యక్రమాలు చేపట్టడం లేదని, కనీసం ఆహారం, మంచినీరు అందక లక్షలాది మంది ఇబ్బంది పడుతున్నారని జగన్ దృష్టికి నాయకులు తీసుకొచ్చారు. జగన్ మాట్లాడుతూ ఈనెల 2వ తేదీన తన పర్యటనలో వరద బాధితుల కష్టాలను స్వయంగా చూశానని, వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వ ఘోర తప్పిదం వల్లనే ఈ ఘటన చోటుచేసుకుందని, అయినా నింద తమపై మోపేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీమంత్రులు మేరుగు నాగార్జున, వెల్లంపల్లి శ్రీనివాస్, కారుమూరి నాగేశ్వరరావు, కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, కైలే అనిల్‌కుమార్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కాపు కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ అడపా శేషు, పార్టీ నాయకుడు షేక్ ఆసిఫ్ పాల్గొన్నారు.

11 వ్యవసాయ రంగ పథకాల పేర్ల మార్పు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వ్యవసాయ రంగ, అనుబంధిత పథకాలు/కార్యక్రమాల పేర్లను మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అగ్రికల్చర్, కో–ఆపరేషన్ విభాగం ప్రత్యేక ముఖ్యకార్యదర్శి బుడితి రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులు జారీజేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న పథకాల పేర్లు, ప్రస్తుత ప్రభుత్వ మార్చిన పేర్ల వివరాలిలా ఉన్నాయి.

పథకం/కార్యక్రమం	మార్చిన పేరు/కార్యక్రమం
1.ఈ–క్రాప్ యాప్	ఈ–పంట
2.వైఎస్ఆర్ రైతు భరోసా–పీఎం కిసాన్	అన్నదాత సుఖీభవం
3.వైఎస్ఆర్ సున్నా వడ్డీ పంట రుణాలు	వడ్డీలేని రుణాలు
4.డాక్టర్ వైఎస్ఆర్ ఫ్రీ క్రాఫ్ ఇన్సూరెన్స్	ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై)
5.వైఎస్ఆర్ యంత్రా సేవా పథకం	ఫార్మ్ మిషనైజేషన్ స్కీమ్
6. డాక్టర్ వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ లేబొరటీస్	ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్
7. వైఎస్ఆర్ యంత్రా సేవా కేంద్రం	విలేజ్/క్లస్టర్ సీహెచ్‌సీఎస్
8. వైఎస్ఆర్ యాప్	వీఏఏ ఫెర్మారెన్స్ మోనటరింగ్ యాప్
9. రైతు భరోసా కేంద్రం	రైతు సేవా కేంద్రం
10. ఆర్‌బీకే ఛానల్/స్టూడియో	పాడి పంటలు ఛానల్/స్టూడియో
11.డాక్టర్ వైఎస్ఆర్ రైతు భరోసా మంత్లీ మ్యాగజైన్	పాండి పంటలు మంత్లీ మ్యాగజైన్

వరద నీటిలో కొట్టుకుపోయిన లైన్‌మెన్

విశాలాంధ్ర–విజయవాడ : విజయవాడ నగరంలోని ముంపు ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో అపశృతి చోటుచేసుకుంది. సహాయక చర్యల్లో నిమగ్నమైన లైన్‌మెన్ వజ్రాల కోటేశ్వరరావు వరద నీటిలో కొట్టుకుపోయి మృతి చెందాడు. ఈ ఘటనపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడు కోటేశ్వరరావు భార్య మాధవికి ఫోన్ చేసి మాట్లాడి సానుభూతి తెలిపారు. ఈ ఘటన పట్ల విచారం వ్యక్తం చేసిన మంత్రి బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

ప్రకాశం బ్యారేజీకి వరద తగ్గుముఖం

దెబ్బతిన్న గేట్లు పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ప్రకాశం బ్యారేజీకి వరద నీరు తగ్గుముఖం పడుతోంది. దాదాపు 11 లక్షల క్యూసెక్కులకుపైగా నీటి ఉధృతితో ప్రకాశం బ్యారేజీకి వచ్చి... కృష్ణాతీర ప్రాంత ప్రజలను బెంబేలెత్తించింది. ఎగువ నుంచి వరద ప్రవాహం తగ్గడంతో ప్రకాశం బ్యారేజీకి నీరు తగ్గుతోంది. మంగళవారం ఉదయం వరకు 8 లక్షల క్యూసెక్కులు ఉండగా... అది క్రమేపీ మరింతగా తగ్గే అవకాశాలున్నట్లు జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. దీంతో ముంపు ప్రాంతాల ప్రజలు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ప్రకాశం బ్యారేజీ గేట్లకు కనీసం 5 లక్షల క్యూసెక్కుల నీరు తగ్గితేనే మరమ్మతుకు సాధ్యమవుతుందని ఇరిగేషన్‌శాఖ యంత్రాంగం నిర్ణయించింది. భారీ వర్షాలు, వరదలతో ప్రకాశం బ్యారేజీ వైపునకు పడవులు దూసుకురావడంతో గేట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీంతో బ్యారేజీ గేట్లను అధికారులతో కలిసి జలవనరులశాఖ సలహాదారు కన్నయ్య నాయుడు పరిశీలించారు. రెండు గేట్లు స్వల్పంగా దెబ్బతిన్నాయని, బ్యారేజీ పటిష్టంగా ఉన్నదని చెప్పారు. ముందుగా గేట్లకు అడ్డుగా ఉన్న బోట్లు తొలగించాలని అధికారులకు కన్నయ్య సూచించారు. వాటిని తొలగించాకనే మరమ్మతులు సాధ్యమవుతుందని చెప్పారు. బోట్ల తొలగింపు కోసం కాకినాడ నుంచి నిపుణులను రప్పించనున్నారు. గేట్ల మరమ్మతుల బాధ్యతను మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చేపట్టారు. గేట్లు ఎత్తడం, మూయడం కోసం ఏర్పాటు చేసిన యంత్రాల పనితీరును తెలుసుకున్నారు. అనంతరం కన్నయ్య నాయుడు మీడియాతో మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజీకి చెందిన కౌంటర్ వెయిట్ బ్రేక్ అయిందని, కొత్త బాక్సులు డిజైన్ చేసినట్లు వివరించారు. మళ్లీ గేట్లు ఎత్తేలోపే కౌంటర్ వెయిట్ ఏర్పాటు చేసుకోవచ్చని వివరించారు. ఒక్క గేటుకే సమస్య ఉన్నందున మిగిలిన గేట్లు ఎత్తవచ్చని స్పష్టంచేశారు. అంతకుముందు జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమావేశమై... దెబ్బతిన్న గేట్లపై చర్చించారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు విజయసారథి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం

వేమిరెడ్డి దంపతుల రూ.కోటి విరాళం

విశాలాంధ్ర బ్యూరో–నెల్లూరు: నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు వరదలతో తీవ్రంగా నష్టపోయిన వారి సహాయార్థం కోటి రూపాయల విరాళం అందించారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రూ.కోటి చెక్కును అందించారు. వరదలతో విజయవాడ తీవ్రంగా నష్టపోయింది. వేలాది మంది ప్రజలు తిండీ, నీరులేక అల్లాడిపోతున్నారు. ఇప్పటికీ అనేక కాలనీలు జలదిగ్బంధంలో ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో వరద బాధితులను ఆదుకునేందుకు వేమిరెడ్డి దంపతులు కోటి రూపాయలను విరాళంగా అందించి మానవత్వం చాటుకున్నారు. విపత్తు నుంచి ప్రజలు త్వరగా బయటపడాలని వారు ఆకాంక్షించారు. కోటి రూపాయలు అందించిన వేమిరెడ్డి దంపతులను సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను ప్రభుత్వం ఆదుకోవాలి

ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదల ప్రభావంతో పేదలకు పనులు, తిండి గింజలు లేక, తాగడానికి మంచి నీరు దొరకక అల్లాడుతున్నారని, వారి బాధలు వర్ణనాతీతమని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వారిని అన్ని రకాలా ఆదుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, అధ్యక్షులు సిహెచ్.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేదలకు ప్రతి కుటుంబానికి వంట చేసుకోవడానికి ఉపయోగపడేలా తక్షణ సహాయంగా 16 రకాల నిత్యవసర వస్తువులు ఉచితంగా పంపిణీ చేయాలని, ఖర్చులకు రూ.10 వేలు ఇవ్వాలని, మూగ జీవాలు కోల్పోయిన పేదలకు రూ.50 వేలు ఇవ్వాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నష్టపోయిన ఆస్తులకు రూ.50 పరిహారం అందించాలని, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కట్టుబట్టలతో నిరాశ్రయులైన పేదలకు వంట సామాగ్రి, దుస్తులు, దుప్పట్లు మిగతా అన్ని రకాలుగా సహాయం చేసి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా అనారోగ్యం పాలైన పేదలందరికీ ఉచితంగా మందులు సరఫరా చేయాలని, మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా కింద రూ.10 లక్షలు ఇవ్వాలని, పంట నష్ట పోయిన రైతులకు పరిహారంతో పాటు తిరిగి పంటలు, ఎరువులు వేయడానికి విత్తనాలు, మందులు ఉచితంగా అందించాలని, వ్యవసాయ ఖర్చులు కూడా ఇవ్వాలని, పంట రుణాలు రద్దు చేయాలని సంఘం నేతలు డిమాండ్ చేశారు.

క్రూయిజ్ పర్యాటకానికి పెద్దపీట

విశాఖ పోర్టులో సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం: విశాఖపట్నం పోర్టు అథారిటీ అధ్వర్యంలో క్రూయిజ్ పర్యాటకం, మౌలిక వసతుల అభివృద్ధిపై సమీక్షా సమావేశం జరిగింది. పోర్టు పరిపాలనా భవనంలోని మంథన్ మందిరంలో మంగళవారం జరిగిన ఈ సమావేశానికి విశాఖలోని ప్రముఖ పర్యాటక నిర్వాహకులు, ట్రావెల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర, విశాఖ జిల్లా పర్యాటక అధికారుల సహకారంతో ఈ సమావేశాన్ని పోర్టు అధికారులు నిర్వహించారు. అంతర్జాతీయ పర్యాటకులను దృష్టిలో ఉంచుకుని విశాఖపట్నం చుట్టూ అభివృద్ధి చేయవలసిన పర్యాటక ప్రదేశాలపై చర్చించినట్లు పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ మీడియాకు తెలిపారు. భారత ప్రభుత్వ ఉద్దేశాన్ని పోర్టు అధికారులు, పర్యాటక సంస్థలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్‌లో అందుబాటులో ఉన్న ఆధునిక సౌకర్యాలను వివరించారు. అంతర్జాతీయ క్రూయిజ్ లైనర్లు విశాఖపట్నంపై చూపుతున్న ఆసక్తిని, స్థానికంగా ఉన్న సంస్కృతీసంప్రదాయాలను ప్రతిబింబించే పర్యాటక ప్రదేశాలను వివరించారు. విశాఖ చుట్టుపక్కల ఉన్న ప్రముఖ పర్యాటక ప్రదేశాలు, అక్కడ ఉన్న మౌలిక వసతులు, అలాగే అంతర్జాతీయ పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఏర్పాటు చేయవలసిన అంశాలు వంటివాటిని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు పోర్టు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. క్రూయిజ్ పర్యాటకుల కోసం సమగ్ర ప్యాకేజీని రూపొందించే అంశాలను చర్చించారు. దీని వలన విశాఖ నగరం అభివృద్ధి చెందడంతో పాటు ఇక్కడి వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. విశాఖ నగరాన్ని అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా మార్చడానికి తీసుకోవాల్సిన చర్యలను ప్రధానంగా ఈ సమావేశంలో చర్చించారు. పోర్టు, స్థానిక పర్యాటక ఆపరేటర్లు రాష్ట్ర ప్రభుత్వం కలిసి పని చేయడం ద్వారా పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చని సమావేశంలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. ఏపీ టూరిజం ప్రాంతీయ డైరెక్టర్ శ్రీనివాస్, పోర్టు అధికారులు, పర్యాటక ఆపరేటర్లు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ వైఫల్యమే: కందుల దుర్గేశ్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వైసీపీ ప్రభుత్వం ప్రకృతి విపత్తుల గురించి పట్టించుకోకపోవడం వల్లే ఇంతటి ఘోర పరిస్థితి ఏర్పడిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ విమర్శించారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి విజయవాడలో ముంపునకు గురైన ప్రాంతాలు మైత్రీనగర్, జయప్రకాశ్ నగర్, సున్నపుబట్టీల సెంటర్, క్రీస్తురాజపురం, అరుణ్ నగర్, గంగిరెద్దుల దిబ్బలో ప్రజలకు అందిస్తున్న సహాయ కార్యక్రమాల్లో మంగళవారం ఆయన పాల్గొన్నారు. మంత్రి దుర్గేశ్ మాట్లాడుతూ ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాలను సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ... బాధితులకు ధైర్యం చెబుతూ... యుద్ధ ప్రాతిపదికన ప్రజలకు సహాయ సహకారాలు అందించేలా కృషి చేస్తున్నారన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బలగాలు, ప్రభుత్వ యంత్రాంగాన్ని రంగంలోకి దించి సహాయ, పునరావాస కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేస్తున్నామన్నారు. ముంపు బారిన పడిన ప్రజలకు తాగునీరు, భోజనం, పాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విజయవాడ గతంలో ఎన్నడు ఈ రకంగా ముంపునకు గురికాలేదన్నారు. ఇటువంటి విపత్తులను ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళతామని మంత్రి దుర్గేశ్ చెప్పారు.

శరవేగంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం: భారీ వర్షాలు, వరదల ప్రభావంతో ముంపునకు గురైన విజయవాడ పరిసర జిల్లాలైన కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో అస్తవ్యస్తమైన విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధన శాఖ కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశాల మేరకు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తన సిబ్బందితో పాటు విద్యుత్ పునరుద్ధరణకు అవసరమైన సామగ్రితో విజయవాడ చేరుకున్నారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వ్యవస్థను చక్కదిద్దేందుకు పృథ్వీతేజ్‌తో పాటు తరలివచ్చిన 600 మంది ఉద్యోగులు (చీఫ్ ఇంజనీర్ నుంచి అసిస్టెంట్ ఇంజనీర్ వరకు, లైన్ స్టాఫ్), కూలీలను 64 బృందాలుగా ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. సీఎండీ పృథ్వీతేజ్ ముందుగా తుళ్లూరు తదితర ప్రాంతాల్లోని సిబ్బందితో సమీక్షలు, సర్వేలు నిర్వహించారు. హరిశ్చంద్రపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని పరిశీలించి నాటు పడవల సాయంతో అక్కడికక్కడే సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. తెనాలి డివిజన్‌లోని కొల్లూరు సెక్షన్‌లో ఏపూరులంక, జువ్వలపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలోని ముంపునకు గురైన ప్రాంతాలను గుర్తించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఏపీఈపీడీసీఎల్ నుంచి వచ్చిన ఉద్యోగులు భవానీపురం హౌసింగ్ బోర్డు, ఐరన్ యార్డ్, వాంబే కాలనీ ఫీడర్, హైవే ఫీడర్లు, పాల ప్రాజెక్టు, సింగ్‌నగర్, వాంబే కాలనీ, కలరా హాస్పిటల్, సుగ్గున లంక, టీచర్స్ కాలనీ, మచిలీపట్నం, ముత్యాలంపాడు, కబేలా–కేకేనగర్, లలితనగర్, సితార, ఊర్మిళ నగర్, ఇబ్రహీంపట్నం, నందిగామ, రామలింగేశ్వరనగర్, స్క్రూ వంతెన, పుట్ట రోడ్, రామాలయం, హెడ్‌వర్క్స్, లోటస్, భట్టిప్రోలు, కాలానగర్, గొల్లపూడి అయ్యప్ప దేవాలయం, దత్త రోడ్డు, రాయనపాడు, సూర్యపాలెం, విద్యాధరపురం, ఏపూరులంక, సుగ్గున లంక, తెనాలి, తోట్లవల్లూరు, ఉయ్యూరు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రత్యేక సెలవులు

ఏపీ (పీటీడీ) ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: వరద ముంపు కారణంగా విధులకు హాజరుకాలేని ఆర్టీసీ ఉద్యోగులకు సాధారణ పరిస్థితులు వచ్చేంత వరకు ప్రత్యేక సెలవులు, సంస్థ నుంచి ఫ్లడ్ ప్రొటెక్షన్ అడ్వాన్స్ మంజూరు చేయాలని ఏపీ (పీటీడీ) ఎంప్లాయిస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాలకు చాలా చోట్ల ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ముంపునకు గురైన డిపో, యూనిట్లలో పనిచేస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల గృహాలు చాలాచోట్ల పూర్తిగా జల దిగ్బంధనంలో చిక్కుకొన్నాయని వివరించారు. దీంతో విధులకు హాజరుకాలేని ఉద్యోగులకు సాధారణ పరిస్థితి వచ్చేవరకు ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలన్నారు. ఇబ్రహీంపట్నం, విద్యాధరపురం డిపో, విద్యాధరపురం సెంట్రల్ హాస్పిటల్, నూజివీడు డిపో, జోనల్ వర్క్ షాప్‌లలోకి పెద్దఎత్తున వర్షపు నీళ్లు వచ్చి డిపోలకు పెద్ద నష్టం వాటిల్లిందన్నారు. ముంపునకు గురైన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. విజయవాడ ఆర్టీసీ హౌస్‌లో పనిచేస్తున్న ఆర్టీసీ (పీటీడీ) ఉద్యోగులు చుట్టుపక్కల ప్రాంతాల్లో నివసిస్తున్న వారి కుటుంబాలు జలమయం కావడంతో విధులకు హాజరు కాలేకపోతున్నారని తెలిపారు. వారందరికీ ప్రత్యేక క్యాజువల్ లీవ్‌లు మంజూరు చేయాలని కోరారు.

మరణాలపై గోప్యత?

పునరావాస శిబిరాలకు 43,417 మందే

సహాయ చర్యల్లో వైఫల్యం!

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: భారీ వర్షాలు, వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య విషయంలో ప్రభుత్వ యంత్రాంగం నుంచి స్పష్టత రాలేదు. మృతుల సమగ్ర వివరాలను ఎప్పటికప్పు ప్రకటించడంలో విపత్తుల నివారణ సంస్థ జాప్యం చేస్తుందన్న విమర్శలున్నాయి. కేవలం మృతుల సంఖ్య మాత్రమే ప్రకటించి... వారి వివరాలపై గోప్యత ప్రదర్శించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. దీంతో వాస్తవ మృతుల సంఖ్య ఎంతనేదీ అంతుచిక్కడం లేదు. గతంలో ఎన్నడూ లేనంత రీతిలో వరదలతో బుడమేరు, కృష్ణానదీ పరివాహక ప్రాంత ప్రజలు అల్లాడిపోయారు. దాదాపు 4 లక్షల మంది వరదలో చిక్కుకున్నట్లు అంచనాలున్నాయి. మంగళవారం మధ్యాహ్నం నాటికి 43,417 మందిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. మిగిలిన 3 లక్షలకుపైగా వరద బాధితులు ఎక్కడ ఉన్నట్లు అనేది చెప్పడం లేదు. దాదాపు 3 లక్షల మంది ఇంకా ఇళ్లలోనే మగ్గుతున్నట్లుగా తెలుస్తోంది. బుడమేరు ముంపు ప్రాంతమైన సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లోనే అధికంగా బాధితులున్నట్లు సమాచారం. నాలుగు రోజులుగా భారీ వర్షాలు, వరదలతో 19 మంది మాత్రమే చనిపోయినట్లు ఈనెల 2వ తేదీ సాయంత్రం ప్రకటించారు. అందులో విజయవాడ మొగల్రాజ పురంలో కొండచరియలు విరిగిపడి మృతి చెందిన ఐదుగురున్నారు. మిగిలిన వారంతా భారీ వర్షాలు, వరదలతో దుర్మరణం చెందిన వారే. వారి చిరునామాలను విపత్తుశాఖ అధికారులు ప్రకటించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా విపత్తుల శాఖ మేల్కొని... ముంపులో ఎంత మంది ఉన్నారు?, పునరావాస శిబిరాలకు రాని వారు ఎంతమంది ఉన్నారనేది వెల్లడించాల్సిన అవసరముంది. ఎప్పటికప్పుడు వరద ముంపు, నివారణ చర్యలతోపాటు మృతుల వివరాలను అధికారికంగా ప్రభుత్వం ప్రకటించాల్సి ఉంది. ఇలా చేయకపోవడంపై వరద ముంపు బాధితుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. వరదల కారణంగా వృద్ధులు, అనారోగ్యంపాలైన వారు ఇళ్లకే పరిమితమయ్యారు. వారి కుటుంబీకులు బయటకు వచ్చి పునరావాసం కోసం ఎదురు చూస్తున్నారు. మరికొందరు ఇప్పటికే పునరావాస శిబిరాలకు వెళ్లారు. సొంత ఇళ్లలో తలదాచుకున్న బాధితులకు ఆహారం, మందులు వగైరా సరఫరా కరువైంది. బాధితులు ఎక్కడెక్కడ ఉన్నారనేది ఇప్పటికీ డ్రోన్ల ద్వారా గుర్తించే పనిలో ఉన్నారంటే... పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో అర్థమవుతోంది. మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రచారం కోసం ఆరాటపడటం తప్ప...క్షేత్రస్థాయిలో ఈ సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదు. లక్షల్లో బాధితులుంటే... అరకొరగా బోట్లు తీసుకు రావడంతోనే నిర్లక్ష్యం వెలుగు చూస్తోంది. దానికితోడు సింగ్‌నగర్ లాంటి ప్రాంతానికే పెద్దపెద్ద పడవులు పంపడం, అవి లోపలి వరకూ వెళ్లే పరిస్థితి లేకపోవడంతో లక్షలాది మంది బాధితులు బయటకు రాలేకపోతున్నారు. ఎన్డీఆర్ఎఫ్ బోట్లు సైతం అరకొరగానే ఉన్నాయి. దీన్ని అదునుగా తీసుకుని ముంపు ప్రాంతాల్లోకి ప్రైవేట్ బోట్లు వస్తున్నాయి. ఒక్కో బోటు నుంచి ప్రజలను బయటకు తరలించాలంటే రూ.1500 డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. కృష్ణానది, బుడమేరు ఉధృతితో వాగులు, వంకల్లో కొంతమంది కొట్టుకుపోయినట్లు వార్తలొచ్చాయి. వారి ఆచూకీ ఇంతవరకూ లభించలేదు. ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి వరదలు, భారీ వర్షాలతో జరిగిన ప్రాణ నష్టం, గల్లంతైన వారి ఆచూకీ కోసం తీసుకుంటున్న చర్యలపై పూర్తి వివరాలు ప్రకటించాల్సి ఉంది.

సంపాదకీయం

కులగణనకు తలొగ్గిన సంఘ్

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.) సైతం ఎట్టకేలకు కులగణన గురించి మాట్లాడవలసి వచ్చింది. ఆర్.ఎస్.ఎస్. అఖిలభారత ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్ ఈ విషయం ప్రకటించారు. కేరళలో మూడు రోజులపాటు ఆర్.ఎస్.ఎస్. సుదీర్ఘ మంతనాలు జరిపి కులగణనను సమర్థించాలని నిర్ణయించింది. కేరళలో ఆర్.ఎస్.ఎస్.కు జనబలం ఏమీ లేదు. అనేక దశాబ్దాలుగా కేరళలో శాసనసభలో అడుగు పెట్టాలని ఆర్.ఎస్.ఎస్. విశ్వప్రయత్నం చేస్తోంది. అయినా ఇన్నేళ్లకు ఒక్క చోట మాత్రమే కమలం వికసించగలిగింది. కేరళలో ఆర్.ఎస్.ఎస్.కు విస్తృతమైన సంస్థాగత ఏర్పాట్లు ఉన్నాయి. అక్కడ అయిదువేల ఆర్.ఎస్.ఎస్. శాఖలు ఉన్నాయి. మరే రాష్ట్రంలోనూ ఇన్ని శాఖలు లేవు. అంటే కేరళలో పాగా వేయడానికి ఎంతగా ప్రయత్నిస్తోందో అర్థం చేసుకోవచ్చు. కులగణన గురించి రక రకాల పద్ధతుల్లో వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నవారు ఇప్పుడు కులగణనను సమర్థిస్తున్నామని చెప్పుకోవడానికి నానా పాట్లు పడుతున్నారు. ఆర్.ఎస్.ఎస్. కులగణనను సమర్థించడం అంటే మోదీ సర్కారు ఆ ఏర్పాట్లలో ఉందనుకోవాలి. లేదా మోదీ మెడలు వంచి ఆర్.ఎస్.ఎస్. ఆ పని చేయిస్తూ ఉండాలి. ఈ రెండింట్లో ఏదో ఒకటి నిజం కాకపోతే మోదీ సర్కారు బహిరంగంగా ఇంతవరకు చెప్తూ వస్తున్నట్టుగా కులగణన అత్యంత ప్రమాదకరమైంది అనైనా ప్రకటించాలి. ఇంతకాలం మోదీ తన దృష్టిలో నాలుగే కులాలు ఉన్నాయి అని చెప్తూ వచ్చారు. కులగణనకు అంగీకరిస్తే ఈ నాలుగు కులాల పరిధి దాటి వేలాది కులాలకు చెందిన వారి లెక్కలు వేయించాల్సి వస్తుంది. ఇప్పుడు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కులగణన గురించి గట్టిగా మాట్లాడడమే కాదు బీహార్‌లో కులగణన చేయించారు కూడా. గత ఆగస్టు అయిదో తేదీన ఆర్.ఎస్.ఎస్. అధికార పత్రిక పాంచజన్యలో కులగణనను వ్యతిరేకిస్తూ హితేశ్ శంకర్ పెద్ద వ్యాసం రాశారు. భారతీయుల కులం ఏది అన్న ప్రశ్నవేసి ఆయన హిందువు అని ఆయనే సమాధానం చెప్పారు. అంటే ఆర్.ఎస్.ఎస్. అధికార పత్రికలో రాసిన దాన్నిబట్టి హిందువు అన్న ఒకే ఒక్క కులం ఉందన్న మొండి వాదనను ఆర్.ఎస్.ఎస్. హఠాత్తుగా విడనాడి కులగణనకు ఎందుకు అంగీకరించిందో అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. కులగణనవల్ల దేశంలో విభేదాలు, వైమనస్యం పెరుగుతాయని ఆ వ్యాసంలో వాదించారు. అలాంటప్పుడు నెల తిరక్కుండానే కులగణనపై ఆర్.ఎస్.ఎస్. వైఖరి మారిన వైనం ఏమిటి అన్న ప్రశ్న తలెత్తి తీరుతుంది. మండల్ నివేదిక తరవాత కేవలం కులంబలం ఆధారంగా ఏర్పడిన రాజకీయ పార్టీలు చాలానే ఉన్నాయి. కానీ వీటివల్ల దేశం విడిపోయిన దాఖలాలు లేవు. మన దేశంలో కులం ఒక కఠోర వాస్తవం. దాన్ని తప్పించుకోలేం. కులగణన కారణంగా కులాలమధ్య విభేదాలు పెరుగుతాయన్నది కేవలం కట్టు కథే. కులాల సమీకరణే బీజేపీ ఎన్నికల ప్రధాన ఎత్తుగడగా మోదీ హయాంలో పదేళ్ల నుంచి భేషుగ్గా కొనసాగుతోంది. అమిత్ షా ఇందులో దిట్ట అని అనేక సార్లు రుజువైంది. కులాలు సమాజాన్ని నిలువునా చీలుస్తాయన్నది సంఘ్ పరివార్ నిశ్చితాభిప్రాయం అయితే కులగణన జరిపించిన నితీశ్ కుమార్ అందించిన కొయ్యకాలు మీద మోదీ ప్రభుత్వం ఎందుకు నిలబడ్డట్టు? కులగణనను వ్యతిరేకిస్తూ సంఘ్ భావజాలం ఉన్నవారు వివిధ పత్రికలలో ముఖ్యంగా సంఘ్ పరివార్ నడిపే పత్రికలలో డజన్ల కొద్దీ వ్యాసాలు రాశారు. ఇక వీరు ఏ అంశం గురించి రాయాలో పాపం! కులగణనవల్ల హిందువుల ఐక్యతకు భంగం కలుగుతుంది అని ఇంతవరకు వాదించిన సంఘ్ పరివార్ కుదురులోని వారు తమ ఆత్మను చంపుకుని వాదనలు వినిపించడానికి ఎన్ని తంటాలు పడాలో!

సంక్షేమ పథకాలు అందజేయడానికి, ప్రధానంగా చాలా వెనుకబడి ఉన్న కులాల వారి సంక్షేమ పథకాలకోసం కులగణన అవసరం అని ఆర్.ఎస్.ఎస్. ఇప్పుడు అంగీకరిస్తోంది. సంఘ్‌లో ఇంతటి మార్పు ఎందుకు వచ్చినట్టు? ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి కులాలవారీ లెక్కలు అవసరమవుతాయని అంబేకర్ అంటున్నారు. కులగణనను రాజకీయాలకు వినియోగించుకోకూడదని ఆర్.ఎస్.ఎస్. ఒక షరతు పెడ్తోంది. సంక్షేమ కార్యక్రమాల అమలు అంటే అది ఆర్థిక అంశాలతో విడివడి ఉండదు. కచ్చితంగా అందులో రాజకీయాలు ఇమిడి ఉంటాయి. ఎన్నికల కోసం కుల సమీకరణను బీజేపీ ఆలింగనం చేసుకుంటున్నప్పుడు కులగణన మాత్రమే రాజకీయాలకు వినియోగించుకుంటారన్న అనుమానం రావడం ఇప్పటి దాకా తాము వ్యతిరేకించిన విషయాన్ని సమర్థించుకోవడానికి మార్గాలు వెతుక్కోవడమే. కులగణన రాజకీయ ఆలోచనల పరిణామ ఫలితం అన్న వాస్తవాన్ని నిరాకరించడం దండగ. పొద్దంతా కులాల ఆధారంగా రాజకీయాలుచేస్తూ చీకటి పడేసరికి కులగణన ఆధారంగా రాజకీయాలు వద్దు అనడం వితండవాదమే. లేదా ఇప్పటికి దాకా తమ తప్పుడు ఆలోచనను కప్పి పుచ్చుకోవడానికి ఆర్.ఎస్.ఎస్. తొడుక్కుంటున్న ముసుగు అనుకోవాలి. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో కులగణన ప్రధాన అంశంగానే ఉంది. సార్వత్రిక ఎన్నికలలో కులగణనను సర్వశక్తులూ కూడదీసుకుని వ్యతిరేకించిన సంఘ్ పరివార్ ఇప్పుడు కులగణనకు విధిలేక తలవంచడం కన్నా నాసిరకం రాజకీయం మరేముంటుందో! తమకు అధికారంవస్తే కులగణన జరిపించడమే కాక రిజర్వేషన్లపై ప్రస్తుతం ఉన్న 50శాతం పరిమితిని తొలగిస్తామని కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో స్పష్టం చేసింది. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలోని ముఖ్యమైన అంశాలను దొంగిలించిన బీజేపీ ఇప్పుడు రిజర్వేషన్ల పరిమితిని పెంచడానికి సిద్ధ పడ్తుందో లేదో కూడా తేలాలి. కేవలం కులగణను సమర్థిస్తున్నామని ఆర్.ఎస్.ఎస్. ప్రకటిస్తే సరిపోదు. ఆర్.ఎస్.ఎస్. రాజకీయ మానస పుత్రిక అయిన బీజేపీ కూడా కులగణనను అంగీకరిస్తున్నట్టు బహిరంగంగా ప్రకటించే రోజు ఎంతో దూరంలో ఉండదు. మోదీ మెడలు వంచి అయినా ఆర్.ఎస్.ఎస్. ఆ పని చేయిస్తుంది. మోదీ ముఖారవిందం చూసి ఓట్లేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గుతోందన్న వాస్తవాన్ని ఆర్.ఎస్.ఎస్. అధినేతలు మోహన్ భగవత్, దత్తాత్రేయ హొస్బలే కూడా గ్రహించారు. మోదీ వ్యవహార సరళే ఎన్నికల్లో బీజేపీ కొంప ముంచిందని ఈ ఇద్దరు సంఘ్ నేతలు దాపరికం లేకుండానే చెప్పేశారు. రిజర్వేషన్లు కల్పించడం సంఘ్ పరివార్‌కు ఎన్నడూ ఇష్టం లేదు. కానీ రిజర్వేషన్లు అమలు చేయకపోతే దేశవాసుల్లో ఎంతటి తిరుగుబాటు వస్తుందో మొన్నటి ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. ఈ వాస్తవాన్ని అంగీకరించడానికి మోదీకి మొహమాటం అడ్డు రావచ్చు. కానీ తన మానసిక పుత్రిక బీజేపీ మోదీతో నిమిత్తం లేకుండా కొనసాగాలన్నది ఆర్.ఎస్.ఎస్. ఆకాంక్ష. ఎన్నికల్లో అభ్యర్థులకు టికెట్లు కేటాయించేటప్పుడు, మంత్రిపదవులు భర్తీ చేసేటప్పుడు అక్కరకొచ్చే కులం ప్రస్తావన శాస్త్రీయ పద్ధతిలో కులగణన అవసరం లేదని వాదించే అవకాశం లేకుండా ఆర్.ఎస్.ఎస్. వైఖరిలో మౌలికమైన మార్పు వచ్చింది. కాదు – కులగణనకు సంఘ్ పరివార్ లొంగిపోక తప్పలేదు.

ప్రత్యామ్నాయ రాజకీయాలు ఆవశ్యం

భవానిశంకర్ నాయక్

కార్మికవర్గ సమూహాలు ఇప్పుడు ప్రత్యామ్నాయ రాజకీయ, సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక వ్యవస్థలను కోరుకుంటున్నాయి. ఈ వ్యవస్థలు జండర్ (స్త్రీ,పురుష), వర్గం, జాతి, మతం లేదా కులంతో నిమిత్తంలేకుండా వాటిపట్ల వివక్షలేకుండా ఉండే, అందరికోసం పనిచేసే వ్యవస్థలు కావాలని కోరుకుంటున్నాయి. పెట్టుబడీదారీ వ్యవస్థ తమకోసం పనిచేయడంలేదని ఇప్పుడు ప్రజలు గుర్తించి అర్థం చేసుకుంటున్నారు. సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో మార్పులు ఉన్నట్లయితేనే ప్రగతిశీల, అభ్యుదయ, శాంతియుత భవిష్యత్తు ఉండే ప్రత్యామ్నాయ రాజకీయాలు అవసరమని కార్మిక సమూహాలు భావిస్తున్నాయి. పాలకవర్గ మోసాలను, పెట్టుబడీదారీ సంస్కృతిని, దోపిడీవర్గ స్వభావాన్ని, హింసను, మోసపూరిత వ్యూహాలను కార్మిక సమూహాలు రోజురోజుకీ స్పష్టంగా గుర్తిస్తున్నాయి. సంప్రదాయ వ్యవస్థలు దీర్ఘకాలంగా అసమానతలను, వివిధ రకాల అన్యాయాలను అనుసరిస్తున్నందున వీటి నుంచి తీవ్రమైన మార్పులను ఆశించలేమని కార్మికవర్గ సమూహాలు అర్థంచేసుకున్నాయి. వీటికి ప్రత్యామ్నాయంగా నూతన భావాలను, ఉద్యమాలను నిర్మించి ఇప్పుడున్న వ్యవస్థను సవాలు చేయాలి. అలాగే ప్రజలందరి సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చే వ్యవస్థలే కావాలి.

ప్రస్తుతం నిరంకుశ, ప్రతీఘాత పాలకవర్గాలకు వ్యతిరేకంగా వివిధ రూపాలలో ప్రజాసమూహాలు ప్రపంచంలో జరుగుతున్నాయి. బ్లాక్‌లైవ్స్ మూవ్‌మెంట్ (నల్లజాతి వారిపై జరుగుతున్న దౌర్జన్యాలకు వ్యతిరేకంగా 2013లో అమెరికాలో చేపట్టిన ఉద్యమం) వాతావరణ, కార్యాచరణ చొరవలు, రైతుల నిరసనలు, యుద్ధవ్యతిరేక, పెట్టుబడీదారీ వ్యవస్థ వ్యతిరేక, యూదు వ్యతిరేక ప్రచారాలు అలాగే గణనీయమైన రాజకీయ పోరాటాలు తదితర ఉద్యమాలు జరుగుతున్నాయి. ప్రజల, ప్రపంచ సుస్థిరత భవిష్యత్తుకోసం సామాజిక, పర్యావరణ మార్పుల కోసం ఈ ఉద్యమాలు జరుగుతున్నాయి. జాతీయ సార్వభౌమాధికారం, సాంస్కృతిక ఐక్యత, మత,జాతి, కులం, స్వచ్ఛతపేరుతో పాలకవర్గాలు కార్మికసమూహాలపైన తీవ్రమైన దాడులను సాగిస్తున్నాయి.

ఇలాంటి వ్యూహం పాలకవర్గానికి నాలుగు నిర్దిష్టమైన లక్ష్యాలను నెరవేర్చేందుకు అనుసరిస్తున్నాయి. పెట్టుబడీదారీ వ్యవస్థ ప్రయోజనాలను ఈ లక్ష్యాలు కాపాడతాయి. మొదటిది- జాతీయత, సంస్కృతి,మతం, సంప్రదాయం, కుటుంబగౌరవం పేరుతో ఊహాత్మక ప్రయోజనాలు కార్మిక వర్గానికి కలుగుతాయని ప్రచారం సాగించడం. రెండవది కార్మికవర్గం ఐక్యతను ధ్వంసం చేయడం, వారిలో తీవ్రమైన ప్రజాస్వామిక మార్పును నిరోధించడం. మూడవది అనుభవాలు, సంఘీభావం, ఆధారమైన ప్రగతిశీల చైతన్యాన్ని ధ్వంసం చేయడం. నాల్గవది రాజ్యాలకు భద్రత, నియంతృత్వ కార్పొరేట్ ప్రభుత్వాలకు మూలాన్ని నిర్మించడం. ఇవి పాలక, పాలకేతర సంపన్నవర్గాల ప్రయోజనాలను కాపాడేందుకు నిరసనలను,

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడీదారీ వ్యవస్థ, దాని రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రూపాలకు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ రాజకీయాల పూర్వగతిని అణచివేసే పెట్టుబడీదారీ వ్యవస్థ జాతీయ యుద్ధాలు, ప్రాంతీయ ఘర్షణలు, నిరంకుశ మతపరమైన కూటాల వేర్పాటు, నియంతృత్వ శక్తుల స్థిరీకరణ, ప్రజాస్వామ్యాన్ని, పౌర హక్కులను ధ్వంసం చేయడంలాంటి వాటి ద్వారా ప్రగతిశీల శక్తులను పెరగకుండా నిరోధిస్తున్నారు. అంతేకాకుండా సంక్షోభ సంస్కృతిని పెంపొందిస్తూ, కుక్క మరో కుక్కను తింటుందన్న సూత్రాలను సృష్టిస్తూ ప్రజల జీవితాలకు అభద్రతను కల్పిస్తోంది.

అలాగే పోలీసు నిరసనలను అణచివేయడం ప్రధానమైన అంశాలు. నిరసనలను, ప్రగతిశీల ఉద్యమాలను, రాడికల్ ప్రత్యామ్నాయాలను నేరంగా పరిగణిస్తున్నారు. అంతేకాదు ఉన్నత సంపన్నవర్గాలు నేరాన్ని, నేర సంస్కృతిని వ్యవస్థీకృతం చేస్తున్నాయి. ఉదాహరణకు యూదు వ్యతిరేక నిరసనలను నేరంగా పరిగణిస్తూ యూదుల హింసను, జాతి వివక్షను, జాత్యహంకారాన్ని, ఊచకోతలను న్యాయమైనవిగా పరిగణిస్తున్నారు. ఈ విధంగా ప్రజాస్వామిక నిరసనలను నేరంగా పరిగణిస్తూ ప్రజాస్వామ్యాన్ని, ప్రగతిశీల మార్పులను అణచివేస్తున్నారు.

వ్యవస్థీకృత వివక్ష ఆచరణలు పెట్టుబడీదారీ వ్యవస్థ అణచివేత, కర్కశమైన సంస్కృతులు కార్మికవర్గం కోరుకుంటున్న ఆధునిక, ప్రజాస్వామ్య,సంఘీభావ ఆధారమైన ప్రగతిశీల సమాజానికి ఇవి ఏమాత్రం అనుగుణమైనవికావు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడీదారీ వ్యవస్థ, దాని రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రూపాలకు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ రాజకీయాల పూర్వగతిని అణచివేసే పెట్టుబడీదారీ వ్యవస్థ జాతీయ యుద్ధాలు, ప్రాంతీయ ఘర్షణలు, నిరంకుశ మతపరమైన కూటాల వేర్పాటు, నియంతృత్వ శక్తుల స్థిరీకరణ, ప్రజాస్వామ్యాన్ని, పౌర హక్కులను ధ్వంసం చేయడంలాంటి వాటి ద్వారా ప్రగతిశీల శక్తులను పెరగకుండా నిరోధిస్తున్నారు. అంతేకాకుండా సంక్షోభ సంస్కృతిని పెంపొందిస్తూ, కుక్క మరో కుక్కను తింటుందన్న సూత్రాలను సృష్టిస్తూ ప్రజల జీవితాలకు అభద్రతను కల్పిస్తోంది. స్వేచ్ఛలను అణచివేస్తోంది. ఆయా రాజ్యాలకు ప్రథమంగా భద్రతను కల్పించడం, నిరంకుశ ప్రభుత్వాలను పెట్టుబడీదారీ వ్యవస్థకు అనుగుణంగా ఏర్పాటుచేయడం ఈ మాత్రమే వీలైన, సహజమైన ప్రత్యామ్నాయమని భ్రమింపచేయడం, పెట్టుబడీదారీ వ్యవస్థ రక్షణకు ప్రజల మనస్సులను నిరంకుశపరచడం, యుద్ధాలు, మతాలు, సంస్కృతి, సామాజిక సంఘర్షణలు ప్రజల మనస్సులను నిరంకుశపరచడం, వ్యక్తులను, సమాజాలను పరిచారకులుగా చేయడం, వారి భౌతిక అవసరాలను క్షీణింపచేయడం, పెట్టుబడీదారీ వ్యవస్థ చేస్తున్నది. మనస్సులను నిరంకుశ పరచినట్లయితే మానసిక ఆరోగ్య పరిస్థితి నాశనమవుతుంది. విశ్లేషణాత్మకమైన, సహేతుకమైన వ్యక్తుల ఆలోచనను నిరంకుశ మనస్తత్వం ధ్వంసం చేస్తున్నది. వ్యక్తిగత, సమష్టి చైతన్యాన్ని అణచివేయడం, ప్రగతిశీలమైన, శాస్త్రీయమైన సమాజాన్ని నిర్మించుకునేందుకు అన్యాయాన్ని, దోపిడీని అంతంచేయకుండా నిరోధించడం పెట్టుబడీదారీ వ్యవస్థ చేస్తున్నది. పెట్టుబడీదారీ వ్యవస్థ నేరవ్యవస్థ ద్వారా సమూహాలను పరిచారకులుగా తయారుచేసేందుకు అవసరమైన క్షేత్రాన్ని సృష్టించడం మనస్సులను నిరంకుశపరచడం ద్వారా జరుగుతుంది. అనేకమంది ప్రజలు ఈ మానసిక స్థితి మూలంగా తమ మరణ శాసనాన్ని తామే రాసుకోవడం సహజమైన అంతాన్ని సృష్టించుకోవడం జరుగుతుంది. ప్రత్యామ్నాయాలను సృష్టించుకునేందుకు ముందుగా పెట్టుబడీదారీ వ్యవస్థను అంతంచేయాలి.

హర్యానాలో 'గో రక్షకుల' కిరాతకాలు

సుశీల్ కుట్టి

'గో రక్షకుల' పేరుతో త్వరలో ఎన్నికలు జరగనున్న హర్యానాలో కిరాతకాలు మొదలయ్యాయి. ఒక సంఘటనలో 12వ తరగతి చదువుతున్న విద్యార్థి గోవుల స్మగ్లర్ అని ఆరోపిస్తూ 'గో రక్షక' దళాలు కాల్చిచంపారు. మరో సంఘటనలో పశ్చిమబెంగాల్ నుంచి వలసవచ్చిన వ్యక్తి హర్యానా గ్రామంలో బీఫ్ తిన్నాడన్న ఆరోపణతో కిరాతకంగా హత్యచేశారు. ప్రస్తుతం అతనితో తిరిగే వాళ్లు కనిపించకుండా పారిపోయారు. భద్రత ఉండే చోట పశ్చిమబెంగాల్‌లో తలదాచుకోవాలని వాళ్లు భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. చిత్తుకాగితాలు పోగుచేసి అమ్ముకుని జీవించే సబీర్ మాలిక్ చర్కిదాద్రి గ్రామంలో ఉంటున్నాడు. అతను మాట్లాడుతూ, తాను పోలీసు లాకప్‌లో లేకపోయిఉంటే తననుకూడా చంపేవారని అతను అన్నాడు. తాము బైటతిరగకుండా పోలీసులాకప్‌లో ఉండటమే భద్రంగా ఉంటుందని ముస్లింలు ఇప్పుడు అనుకుంటున్నారు. సబీర్‌ను, అతని స్నేహితుడుని బస్టాండుకు రమ్మని కొంతమంది కోరారు.

వీరెవరో కాదు గోరక్షకులే. ఇలా అనేకమందిని ఏదో విధంగా ఒప్పించి దూరంగా తీసుకువెళుతున్నారు. కుదిరితే అక్కడే హింసించి చంపేస్తున్నారు. సబీర్ పొరపాటున బస్టాండుకు వెళ్లాడు. అతను ఊహించినట్లే అయింది. అతను బీఫ్ తిన్నాడని అనుమానించి చంపివేశారు.

ఈ హంతకులు ఒక వ్యక్తి బీఫ్ తిన్నాడని ఎలా నిర్ధారిస్తారు? చిత్తు కాగితాలు ఏరుకునే సబీర్‌ని అనుమానించి చంపివేశారు. అనుమానంతో గోసంరక్షకులు అత్యంత విలువైన మనిషి జీవితాన్ని దారుణంగా అంతం చేస్తున్నారు. హర్యానాలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో కాషాయశక్తులు గెలుపొందడానికి గోరక్షకులపేరుతో అమాయకులను చంపివేస్తున్నారు. సబీర్ మాలిక్ అతని స్నేహితుడు బస్టాండుకు సమీపంలోని చిత్తుకాగితాలు కొనుగోలుచేసే షాప్‌కు వెళ్లారు. అప్పుడు సబీర్‌ను పట్టుకోగలిగారుగానీ, అతని స్నేహితుడు తప్పించుకుని పారిపోయాడు. గోరక్షకులు ముందుగా వేసుకున్న పథకం ప్రకారం సబీర్‌ను చంపివేశారు. చర్కిదాద్రి గ్రామానికి అసోం, పశ్చిమబెంగాల్ నుంచి అనేకమంది కార్మికులు వలసవచ్చారు. ఈ గ్రామం హత్యల కేంద్రంగా మారిందని చెప్పుకుంటున్నారు. ఈ ప్రాంతంలో పోలీసులు భద్రత చర్యలను పెంచారు. ఈ హత్యలకు రాజకీయపరమైన ఎన్నికల వాతావరణం ఏర్పడటమే కారణమని భావిస్తున్నారు.

సోషల్ మీడియాపైన పోలీసులు నిఘా పెట్టారు. గో రాజకీయాలు హర్యానాలో ఎక్కువయ్యాయి. ఈ రాష్ట్రంలో శాఖాహారుల కంటే మాంసాహారులు ఎక్కువగా ఉన్నారు. ప్రత్యేకించి జాట్‌లు మాంసాహారులు. సబీర్‌మాలిక్ ఆలోచించకుంటే ఇలాంటి సంఘటనలు జరిగే ప్రాంతానికి వెళ్లి చిక్కుబడిపోయి హత్యకు గురయ్యారు. గో సంరక్షకులపేరుతో అనుమానితులను హత్యలు గావించేవారు హర్యానాలో ఎక్కువగాఉన్నారు. ఆ తరువాత స్థానం రాజస్థాన్‌దే. రాష్ట్రంలో కొంతమంది యువకులు వివిధప్రాంతాల్లో తిరుగుతూ ఏ ఆహారాన్ని ఇష్టపడతారని అడుగుతున్నారు. గో రక్షణ చట్టాన్ని మీరు ప్రచారం చేస్తున్నారు. పోలీసులు ప్రశ్నిస్తే ఈ చట్టాన్ని ఉదహరిస్తున్నారు. బీజేపీ ఎలాగైనా అసెంబ్లీ ఎన్నికలను గెలుచుకోవాలని ఇలాంటి హత్యలేమీ తమకు తెలిసి జరగడంలేదని బీజేపీ నాయకులు చెప్తున్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఇలాంటివాటిని హర్షించరని బీజేపీ నాయకులు ప్రచారం సాగిస్తున్నారు, హర్యానాలో గో రక్షణచట్టం చేశారు. 2015లో చేసిన ఈ చట్ట ప్రకారం, గోవులను ఒకచోట నుంచి మరోచోటకి తరలించడం, నరికివేయడంలేదా బీఫ్ కలిగిఉండటం లేదా బీఫ్‌ను తినడం నేరంగా పరిగణిస్తారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నయాబ్ షైని అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఈ సమయంలో గో రక్షణపైన ప్రభుత్వం అనుచరశక్తులు కన్నువేసి కిరాతకాలకు పాల్పడుతున్నారు. గోవులును రక్షించేపేరుతో గోరక్షక దళాలు ఏర్పడ్డాయి. ఈ దళాలకు బాగా ఆదరణ ఏర్పడింది. గోరక్షక పేరుతో సాగిస్తున్న హత్యలను ముఖ్యమంత్రి నయిబ్ షైని అలాంటివేమీ జరగడంలేదని చెప్తున్నారు. హత్యలకు పాల్పడే గ్రూపుల్లో 8మందిని అరెస్టు చేసామని, వారిలో ఒకరు జైలులో ఉన్నారని పోలీసులు చెప్పారు. మరో ఇద్దరు బాలలరక్షణ కేంద్రాలలో ఉండగా, తక్కిన 5మంది పోలీసు కస్టడీలోఉన్నారు. ఆహారాన్ని గురించి ప్రశ్నించే దళాలు ఆధార్‌కార్డులు చూపించమని వత్తిడి చేస్తున్నారు. ఏమైనా ఈ రాష్ట్రం ముస్లింలకు ప్రమాదకరమైనదిగా మారిందని చెప్తున్నారు.

చైనా పెట్టుబడులపై బీజేపీలో పోరు

ఎం కోటేశ్వరరావు

మన దేశంలో అగ్రశ్రేణి ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ తన విద్యుత్ కార్లకు చైనా బ్యాటరీలను కొనాలని నిర్ణయించింది. మేకిన్ ఇండియా పథకం కింద విద్యుత్ బాటరీలను తయారు చేస్తున్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగిన తరువాత ఈ పరిణామం చోటు చేసుకుంది. ఇదే సమయంలో గతంలో విధించిన నిషేధాలను తొలగించి ఇబ్బందిలేని ఎలక్ట్రానిక్స్ వంటి రంగాలలో చైనా పెట్టుబడులను అనుమతించాలని కూడా నిర్ణయించారు. 2030నాటికి దేశంలో 30శాతం వాహనాలు విద్యుత్ బాటరీతో నడిచే అవకాశం ఉన్నందున వాటి ఉత్పత్తిని పెంచాల్సి ఉంది. ఈ క్రమంలో చైనా పెట్టుబడుల అవసరం మనదేశానికి ఉందా లేదా అని మోదీ బీజేపీలో "అంతర్గత పోరు" ఉన్నట్లు 2024 ఆగస్టు ఒకటవ తేదీన అమెరికా-భారత సంయుక్త యాజమాన్యంతో నడుపుతున్న సిఎన్‌బిసి టీవీ ఛానల్ ఒక వార్తను ప్రసారం చేసింది. కొద్ది నెలలుగా జరుగుతున్న పరిణామాలను చూసినప్పుడు చైనా,అమెరికా,రష్యా దేశం ఏదైతేనేం వాటి నుంచి వచ్చే పెట్టుబడులు లేదా సంబంధాలను నిర్ణయించేది, నడిపేది మన పాలకులా, కార్పొరేట్లా అన్న సందేహం కలుగుతున్నది. గతంలో సరిహద్దు వివాదం ఉన్నప్పటికీ చైనాతో సంబంధాలు సజావుగా ఉన్నాయి. గల్వాన్ ఉదంతాల సందర్భంగా చైనా మన భూభాగాన్ని ఆక్రమించలేదని స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన సంగతి తెలిసిందే. సంఘపరివార్ చైనా, కమ్యూనిస్టు వ్యతిరేకత గురించి తెలిసినప్పటికీ గత పదేండ్లలో వాణిజ్య, పారిశ్రామికవేత్తలు చైనా నుంచి దిగుమతులు చేసుకుంటుండగా లేనిది దాని పెట్టుబడుల అంశంలో ఎందుకు మడిగట్టుకోవాలనే ధోరణి ఇటీవలి కాలంలో పెరిగింది.

గల్వాన్ లోయలో జరిగిన ఉదంతాల తరువాత దేశంలో పెద్ద ఎత్తున చైనా వ్యతిరేకతను రెచ్చగొట్టారు. ఆ దేశ యాప్‌లను నిషేధించారు. పెట్టుబడులు రాకుండా ఆంక్షలు పెట్టారు. కాషాయ దళాలు, మీడియాలో కొంత భాగం చైనా వస్తు దిగుమతులను నిలిపివేస్తే అది మన కాళ్ల దగ్గరకు వస్తుందనే ప్రచారం చేశారు. తీరాచూస్తే మన ఉక్కు మంత్రిత్వశాఖ తాజా నివేదిక ప్రకారం మన దేశం దిగుమతి చేసుకుంటున్న ప్రతి నాలుగు ఉక్కు వస్తువులలో మూడు చైనా నుంచే ఉన్నట్లు ఆగస్టు 29వ తేదీ హిందూ బిజినెస్ లైన్ పత్రిక వార్త పేర్కొన్నది. గతేడాది ఏప్రిల్-జూలై నెలలతో పోల్చితే మన దిగుమతులు అక్కడి నుంచి 30శాతం పెరిగాయి. ఏడాది క్రితం మన ఎగుమతులు ఎక్కువగా ఉండేవి కాస్తా ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. ఇతర దేశాలకూ మన ఎగుమతులు పడిపోయాయి. విచారకరమైన అంశం ఏమంటే చివరికి గొడుగులు, బొమ్మలను కూడా చైనా నుంచి దిగుమతి పెరగటం వలన మన ఎంఎస్ఎంఇ సంస్థలు దెబ్బతింటున్నాయని గ్లోబల్ ట్రేడ్ రిసర్చ్ ఇనీషియేటివ్(జిటిఆర్ఐ) స్థాపకుడు అజయ్ శ్రీవాత్సవ చెప్పారు (2024సెప్టెంబరు ఒకటవ తేదీ పిటిఐ వార్త). ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు మనం చైనాకు 850కోట్ల డాలర్ల విలువగల వస్తువులను ఎగుమతి చేయగా అక్కడి నుంచి 5,040 కోట్ల డాలర్ల మేర దిగుమతి చేసుకున్నామని జిటిఆర్ఐ నివేదిక వెల్లడించింది. చైనాతో పోటీ పడి గొడుగులను కూడా ఉత్పత్తి చేయలేని దుస్థితికి గత పదేండ్లలో మన దేశాన్ని మోదీ నెట్టారా ? చిన్నప్పటి పాఠాల్లో భార్య ఎండకు తాళలేక ఆపసోపాలు పడుతుంటే ఒక రుషి ఆగ్రహ శాపానికి భయపడి సూర్యుడు దిగివచ్చి చెప్పులు, గొడుగు ఇచ్చినట్లు చదువుకున్నాం. ఇప్పుడు చైనా వారు ఇస్తున్నారు. ఎందుకు కరుణించటం లేదు ! చైనాతో పోటీ పడి నాణ్యంగా, చౌకగా గొడుగులు తయారు చేసేందుకు మన వేదాల్లో నిగూఢమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వెలికితీసే నిపుణులు, దేశం కోసం-ధర్మం కోసం పని చేసే వారే లేరా ?

ఇటీవలన మన దేశ వార్షిక ఆర్థిక సర్వే విడుదల చేశారు. దాని వివరాల ప్రకారం చైనా నుంచి ఎఫ్‌డిఐని ఆహ్వానించాలని ప్రధాన ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ చెప్పారు. రెండు దేశాల మధ్య వాణిజ్య లావాదేవీలను పెంచుకోవటం కంటే చైనా నుంచి పెట్టుబడులను ఆహ్వానించటం మెరుగని ఆర్థిక మంత్రికి నివేదించారు.

గల్వాన్ ఉదంతాల తరువాత వైఖరిలో వచ్చిన మార్పుకు సూచిక ఇది. అమెరికా, ఐరోపాలు చైనా నుంచి సేకరణకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నందున మనం చైనా నుంచి దిగుమతులు చేసుకోవటం, వాటికి కొంత విలువను జోడించి తిరిగి ఎగుమతి చేయటం కంటే చైనా కంపెనీల పెట్టుబడులతో మనదేశంలో వస్తువులను ఉత్పత్తి చేసి విదేశీ మార్కెట్లకు ఎగుమతి చేయటం మరింత ప్రభావం చూపుతుందని ఆ నివేదికలో పేర్కొన్నారు. దీనికి ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కూడా విలేకర్ల సమావేశంలో మద్దతు తెలిపారు. ప్రస్తుతానికి అలాంటి పునరాలోచన లేదని వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ చెప్పినట్లు రాయిటర్స్ పేర్కొన్నది. "బీజేపీ ప్రతిష్టను దెబ్బతీసే పర్యవసానాలకు దారితీసే దీన్ని ఎవరూ కోరుకోవటం లేదు. ఈ విధానాన్ని భారతీయులు మెచ్చరు, కానీ అది అవసరమని మోదీ ఆయన ఆర్థిక మంత్రిత్వశాఖ గుర్తించింది " అని నాటిక్సిస్‌లోని ఆసియా పసిఫిక్ ఎకానమిస్ట్ అల్సియా గార్సియా హెరారో చెప్పినట్లు సిఎన్‌బిసి వార్త పేర్కొన్నది.

రానున్న ఐదు సంవత్సరాల్లో ఏటా వంద బిలియన్ డాలర్లమేర ఎఫ్‌డిఐలను ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.గత ఆర్థిక సంవత్సరంలో 71బిలియన్ డాలర్లు వచ్చాయి. సోలార్ పలకలు, విద్యుత్ బాటరీల తయారీ రంగాలలో చైనా పెట్టుబడులను అనుమతించేందుకు నిబంధనలను సులభతరం చేయనున్నారు. "భారత ఉత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అమెరికా, ఐరోపా విముఖంగా ఉన్నారు. అత్యధిక విదేశీ పెట్టుబడులు ఐసిటి(ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీస్) డిజిటల్ సర్వీసెస్ వంటి రంగంలోకి వెళ్లాయి" అని హెరారో చెప్పాడు. ఆసియా ఉత్పత్తి కేంద్రంగా మారాలని భారత్ కోరుకుంటే చైనా సరఫరా గొలుసులతో సంబంధాలు పెట్టుకోవాలని దిల్లీ కేంద్రంగా పని చేస్తున్న అబ్జర్వర్ రిసెర్చ్ ఫౌండేషన్‌లోని విదేశీ విధాన అధ్యయన విభాగ ఉపాధ్యక్షుడు హర్ష వి పంత్ చెప్పారు.

ముందే చెప్పుకున్నట్లుగా చైనా వ్యతిరేకతను పెద్ద ఎత్తున రెచ్చగొట్టిన కారణంగా వ్యతిరేకులను సంతుష్టీకరించేందుకు, రాజకీయంగా పరువు నిలుపుకొనేందుకు గత కొద్ది నెలలుగా చైనా పెట్టుబడులను అందరితో అంగీకరింపచేయించేందుకు దిల్లీ పెద్దలు కసరత్తుచేస్తున్నారు. "ఆర్థిక కోణంలో చూస్తే కొన్ని రంగాలలో చైనా పెట్టుబడులు మనకు అవసరమే అని చక్కటి తర్కంతో చెప్పవచ్చు. కానీ ఆక్రమంలో దేశ భద్రత,అంతర్జాతీయ రాజకీయ కోణాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది, ప్రస్తుతం చైనాతో సంబంధాలు అంత మంచిగా, సాధారణంగా లేవు " అని విదేశాంగ మంత్రి జై శంకర్ ఇటీవల చెప్పారు. 2070 నాటికి పూర్తి కాలుష్య రహిత లక్ష్యాన్ని చేరుకోవాలని మనదేశం లక్ష్యంగా పెట్టుకుంది.దానిలో భాగంగా 2030 నాటికి 50శాతం విద్యుత్‌ను పునరుత్పత్తి ఇంధన వనరుల నుంచి తయారు చేయాల్సి ఉంది. చైనా ఆ రంగంలో ఎంతో ముందుంది, తక్కువ ఖర్చుతో, సమర్థవంతంగా ఉత్పత్తి చేస్తున్నది. ప్రస్తుతం అది 584 టెరావాట్ అవర్స్ సామర్థ్యం కలిగి ఉండగా మనది కేవలం 113 టెరావాట్ అవర్స్ మాత్రమే.చైనా కమ్యూనిస్టుదేశం, మనది ప్రజాస్వామ్యం అక్కడి నుంచి పెట్టుబడులు ఎలా తీసుకుంటాం అని మడిగట్టుకు కూర్చొనేందుకు మనదేశంలోని కార్పొరేట్ కంపెనీలు సిద్ధంగా లేవు. అక్కడి నుంచి దిగుమతులు చేసుకొనే బదులు పెట్టుబడులు తీసుకొని మనదేశంలోనే సంస్థలను ఏర్పాటు చేస్తే ఇక్కడ ఉపాధిని కూడా కల్పించవచ్చు. ప్రస్తుతం మన దేశం తప్ప ప్రపంచంలో మరేదేశమూ చైనా పెట్టుబడులపై పూర్తి నిషేధం విధించలేదు. దాన్నుంచి పూర్తిగా విడగొట్టుకునేందుకు ఏ దేశమూ సిద్ధంగా లేదు. తోటి సోషలిస్టు దేశమైనా చైనా-వియత్నాం మధ్య కొన్ని సరిహద్దు విబేధాలున్నాయి, అయినా చైనా నుంచి పెట్టుబడులను తీసుకుంటున్నది.

కేజ్రీవాల్, దుర్గేశ్ పాఠక్‌కు కోర్టు సమన్లు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసుకు సంబంధించి సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌ను ఢిల్లీ కోర్టు పరిగణనలోకి తీసుకున్నది. ఈ మేరకు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు దుర్గేశ్ పాఠక్‌కు సమన్లు జారీ చేసింది. ఈ కేసు విచారణ సెప్టెంబర్ 11కు వాయిదా పడింది. ఢిల్లీ ఎక్సైజ్ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆప్ మాజీ కమ్యూనికేషన్ ఇన్‌ఛార్జ్ విజయ్ నాయర్‌కు సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చిన విషయం తెలిసిందే. మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్ తీహార్ జైలులో ఉన్నారు.

రాహుల్, ఖడ్గేతో హేమంత్ సోరెన్ భేటీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీతో జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ మంగళవారం ఇక్కడ సమావేశమయ్యారు. తాను కాంగ్రెస్ అగ్రనేతలను మర్యాదపూర్వకంగా కలిశానని, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రెండు పార్టీలు త్వరలో చర్చలు ప్రారంభిస్తాయని హేమంత్ సోరెన్ తెలిపారు. ఖడ్గే, రాహుల్ గాంధీతో భేటీ అనంతరం సోరెన్ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులను కలవాలని తాను ఎప్పటినుంచో అనుకుంటున్నానని, ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని చెప్పారు. రానున్న జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేయడంపై తాము చర్చిస్తామని తెలిపారు. తాము పూర్తి బలంతో జార్ఖండ్ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నామని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. హేమంత్ సోరెన్‌తో పాటు ఆయన భార్య కల్పనా సోరెన్ కూడా కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీలో పాల్గొన్నారు. అంతకుముందు సోరెన్ రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో సూఫీ సన్యాసి ఖ్వాజా గరీబ్ నవాజ్‌ను సందర్శించారు. రాష్ట్రం, దేశం సుఖశాంతులతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

27 పాఠశాలల్లో సీబీఎస్ఈ తనిఖీలు

న్యూఢిల్లీ: సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) బోర్డు కొన్ని పాఠశాలల్లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. నకిలీ పాఠశాలలే లక్ష్యంగా తనిఖీలు ప్రారంభించింది. ఇందులో భాగంగా దేశ రాజధాని ప్రాంతం ఢిల్లీతో పాటు రాజస్థాన్‌లో మొత్తం 27 పాఠశాలల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టినట్లు బోర్డు కార్యదర్శి వెల్లడించారు. ఆరు నెలల క్రితం డమ్మీ విద్యార్థులు, అనర్హత కలిగిన అభ్యర్థులతో నడుపుతున్న 20 పాఠశాలల గుర్తింపును రద్దు చేసిన నేపథ్యంలో ఈ తనిఖీలు కీలక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అనుబంధ పాఠశాలలన్నీ తమ నిబంధనలకు కట్టుబడి ఉండేలా చూసేందుకు చేస్తోన్న ప్రయత్నాల్లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టింది. 'ఈ తనిఖీల్లో మొత్తం 27 బృందాలు పాల్గొన్నాయి. ఒక్కో బృందంలో సీబీఎస్ఈ అధికారితో పాటు సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలకు చెందిన ప్రిన్సిపల్ ఉన్నారు. ఈ బృందాలు ఏకకాలంలో తనిఖీలు చేపట్టాయి. ఎంపిక చేసిన పాఠశాలల్లో కచ్చితమైన ప్రణాళికతో తనిఖీలు చేపట్టాం' అని సీబీఎస్ఈ కార్యదర్శి హిమాన్షు గుప్తా తెలిపారు. ఈ తనిఖీల్లో గుర్తించిన అంశాలపై సమీక్షిస్తామని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.

ఆప్‌తో కాంగ్రెస్ పొత్తు పొడిచేనా?

మంతనాలు జరపాలని హర్యానా నాయకత్వానికి రాహుల్ సూచన

న్యూఢిల్లీ : హర్యానాలో ఎన్నికలకు కేవలం నెల రోజులు మాత్రమే సమయం ఉండటంతో రాజకీయ పార్టీల సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే ఇప్పుడు కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) లోక్‌సభ ఎన్నికల నాటి తమ పొత్తును కొనసాగిస్తాయా? అని రాజకీయ వర్గాల్లో పెద్ద ప్రశ్న నడుస్తోంది. వారం క్రితం ఒక ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా రెండు పార్టీల మధ్య పొత్తుపై ఎటువంటి చర్చలు జరగలేదని చెప్పారు. 'మేము కుదుర్చుకున్న కూటమి జాతీయ స్థాయిలో ఉంది. మేము వారితో మాట్లాడలేదు. ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్ మధ్య పోరు ఉంది' అని ఆయన అన్నారు. ఈ సంవత్సరం ప్రారంభంలో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో హర్యానాలో కాంగ్రెస్ ఐదు స్థానాలను గెలుచుకుంది. 2019 నుంచి ఇది పెద్ద మెరుగుదల. అయితే ఈ సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో ఆప్ సున్నా సాధించింది. ఈ పరిణామాల నేపథ్యంలో సోమవారం జరిగిన పార్టీ ఎన్నికల కమిటీ సమావేశంలో ఆప్‌తో పొత్తు పెట్టుకోవడంపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పార్టీ నేతల అభిప్రాయాన్ని కోరినట్లు తెలిసింది. 90 సీట్ల సభకు జరిగే ఎన్నికల్లో ఆప్ అభ్యర్థులకు 3 నుంచి 4 సీట్లు కేటాయించేందుకు హుడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్ 30 మంది అభ్యర్థులను ఖరారు చేసిందని, రేపు అభ్యర్థుల జాబితాను విడుదల చేసే అవకాశం ఉందని సమాచారం. ఆప్‌తో పొత్తుకు సంబంధించిన చర్చపై కాంగ్రెస్ అధికారికంగా ఏమీ చెప్పలేదు.

కాంగ్రెస్ ఎందుకు పొత్తు కోరుకుంటుంది?

రాహుల్ గాంధీ ఇప్పుడు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. ఇక సార్వత్రిక ఎన్నికలలో బీజేపీకి లోక్‌సభలో మెజారిటీ దక్కలేదు. ఈ నేపథ్యంలో హర్యానాలో ఇండియా ఐక్య సంఘటన గెలుపు అధికార పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ నాయకత్వం ప్రతిపక్ష కూటమిని బలోపేతం చేయడం, 'ఇండియా' కూటమిలో పెద్ద సోదరుడిలా వ్యవహరించడం, పార్లమెంటు లోపల, వెలుపల బీజేపీపై ఒత్తిడి తీసుకురావాలని చూస్తోంది. హర్యానా విజయం కోసం ఓట్ల విభజనను నిరోధించడం చాలా కీలకం. అందుకే రాష్ట్ర నాయకత్వం అభిప్రాయం తీసుకుని పొత్తు పెట్టుకోవాలని కాంగ్రెస్ చూస్తోంది. ఇదిలాఉండగా, ఆప్‌తో పొత్తు ఎంపికకు గల అవకాశాలను పరిశీలించాలని గాంధీ నాయకులను కోరినట్లు వచ్చిన వార్తలను ఆప్ సీనియర్ నాయకుడు, ఎంపీ సంజయ్ సింగ్ స్వాగతించారు. మనీ లాండరింగ్ కేసులో జైలులో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను సంప్రదించిన తర్వాత దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. అయితే హర్యానాలోని మొత్తం 90 స్థానాల్లో ఆప్ ఒంటరిగా పోటీ చేస్తుందని గతంలో కేజ్రీవాల్ చెప్పారు.

గట్టి బేరసారాలకు అవకాశం

హర్యానాలోని 10 లోక్‌సభ స్థానాలు, చండీగఢ్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్, ఆప్ పొత్తు పెట్టుకున్నాయి. హర్యానాలో ఐదు సీట్లు, చండీగఢ్‌లో కూడా కాంగ్రెస్ విజయం సాధించగా, ఆప్ కూటమి వల్ల పెద్దగా ప్రయోజనం పొందలేదు. ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్దిసేపటికే, హర్యానాలోని కురుక్షేత్రలో తమ అభ్యర్థి సుశీల్ గుప్తా ఓటమికి కాంగ్రెస్ హర్యానా నాయకులలో ఒక వర్గం కారణమని ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికల కోసం ఆప్, కాంగ్రెస్ మధ్య ఏదైనా పొత్తు చర్చలు రెండు వైపుల నుంచి గట్టి బేరసారాలు చూసే అవకాశం ఉంది. పంజాబ్‌లో కాంగ్రెస్ పరిస్థితి మెరుగవడంతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది సత్తా చాటాలని కాషాయ పార్టీని మట్టికరిపించాలని రాహుల్ గాంధీ కసరత్తు సాగిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్‌తో పొత్తు విషయంలో ఆప్ ఇంకా ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదు.

కోల్‌కతా సీపీ రాజీనామా డిమాండ్‌తో

జూనియర్ వైద్యుల ధర్నా

కోల్‌కతా: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను పారదర్శకంగా దర్యాప్తు చేయాలని, నగర పోలీసు కమిషనర్ వినీత్ గోయల్ రాజీనామా డిమాండ్‌తో కోల్‌కతా పోలీసు ప్రధాన కార్యాలయం లాల్‌బజార్‌కు ర్యాలీగా బయలుదేరిన వివిధ వైద్య కళాశాలల జూనియర్ వైద్యులు మంగళవారం కూడా సమీపంలోని బి.బి.గంగూలీ వీధిలో ధర్నా నిర్వహించారు. అయితే 23 గంటల తర్వాత కూడా వారిని మరింత ముందుకు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. అనేక మంది సామాన్యులు, ఇతర విద్యా సంస్థల విద్యార్థులు చేరిన ఈ ఆందోళనా కార్యక్రమంలో వైద్యులు లాల్‌బజార్‌కు అర కిలోమీటరు దూరంలో ఉన్న బి.బి.గంగూలీ వీధిలో సోమవారం రాత్రంతా ధర్నా కొనసాగించారు. అయితే కోల్‌కతా పోలీసు అధికారుల భారీ బృందం గొలుసులతో బంధించి, తాళం వేసి ఉన్న బారికేడ్‌కు అవతలి వైపు కాపలాగా ఉంది. జూనియర్ డాక్టర్లు బారికేడ్‌పై వెన్నెముక, ఎర్ర గులాబీల ప్రతిరూపాన్ని ఉంచారు. పౌరులను రక్షించడానికి పోలీసు బలగాల విధిని నొక్కిచెప్పడమే ప్రతిరూపమని వారు పేర్కొన్నారు. 'ఇది మా ప్రణాళికలో లేదు. కోల్‌కతా పోలీసులు మమ్మల్ని ఆపడానికి 9 అడుగుల ఎత్తులో బారికేడ్ వేస్తారని మాకు తెలియదు. లాల్‌బజార్‌కు చేరుకుని సీపీని కలిసే వరకు మా ఆందోళన కొనసాగుతుంది. మేము అప్పటి వరకు ఇక్కడే కూర్చుంటాము' అని ఆందోళన చేస్తున్న వైద్యుల్లో ఒకరు పీటీఐకి చెప్పారు. వైద్యులతో సహా అందరికీ న్యాయం చేయాలని, రక్షణ కల్పించాలని నినాదాలు చేస్తూనే ఉన్నారు. అనంతరం కోల్‌కతా పోలీసు అదనపు పోలీసు కమిషనర్ (ఐఎల్ఐ) సంతోష్ పాండేతో పాటు ఇతర అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని వైద్యులతో చర్చలు జరిపి వారిని శాంతింపజేశారు. అయితే కోల్‌కతా పోలీసు ప్రధాన కార్యాలయానికి ప్రదర్శనను అనుమతించాలని, పోలీసు కమిషనర్ రాజీనామా చేయాలంటూ వైద్యులు తమ డిమాండ్‌ను కొనసాగించడంతో చర్చలు ఫలవంతం కాలేదు. డాక్టర్లు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు లాల్‌బజార్ వైపు తమ ప్రదర్శనను ప్రారంభించి, గోయల్ రాజీనామాకు పిలుపునిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. బి.బి.గంగూలీ వీధిలో పోలీసు కమిషనర్ దిష్టిబొమ్మను కూడా దహనం చేశారు. ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ వారు నినాదాలు చేశారు. ఆగస్టు 9న యువ వైద్యురాలిపై హత్యాచారం కేసు దర్యాప్తును కలకత్తా హైకోర్టు సీబీఐకి అప్పగించకముందే పోలీసులు తమ విచారణలో తగిన చర్యలు తీసుకోలేదని వైద్యులు ఆరోపించారు.

2.5 లక్షల మంది ఉద్యోగుల జీతాల నిలిపివేత

యూపీ సర్కారు నిర్ణయం

లక్నో: ఉద్యోగులు తమ ఆస్తులకు సంబంధించిన వివరాలు ఇవ్వలేదన్న కారణంతో దాదాపు రెండున్నర లక్షలమంది ఉద్యోగుల జీతాలను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిలిపివేసింది. ఇటీవల ఆస్తుల వివరాలు వెల్లడించేందుకు మానవ్ సంపద పోర్టల్‌ను యూపీ ప్రభుత్వం ప్రారంభించింది. ఆ పోర్టల్‌లో ఆగస్టు 31వ తేదీ వరకు ఉద్యోగులు తమ ఆస్తుల వివరాలు తెలపాలని నిబంధన పెట్టింది. అయితే ఇప్పటివరకు 71 శాతం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ ఆస్తులకు సంబంధించిన సమాచారాన్ని పోర్టల్‌లో పొందుపరిచారు. ఇంకా 2,44,565 మంది ఉద్యోగులు తమ ఆస్తుల వివరాలు వెల్లడించాల్సి ఉంది. అయితే ఆస్తుల వివరాలు వెల్లడించని వారందరికీ యోగి ప్రభుత్వం ఆగస్టు నెల జీతాలు నిలిపివేసింది. అన్ని శాఖలు ఇచ్చిన నివేదికల ఆధారంగా ప్రాపర్టీ వివరాలు వెల్లడించని వారి జీతాన్ని నిలిపివేసినట్లు ప్రభుత్వం చెప్పింది. కాగా, ఐఏఎస్, ఐపీఎస్, పీపీఎస్, పీసీఎస్ అధికారుల తరహాలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా తమ ఆస్తుల వివరాలు వెల్లడించాలి. అయితే టీచర్లు, కార్పొరేషన్ ఉద్యోగులు, స్వయంప్రతిపత్తి సంస్థల ఉద్యోగులను ఈ నిబంధన నుంచి ప్రభుత్వం మినహాయించింది.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ఏఐసీసీ కార్యదర్శులతో ఖడ్గే, రాహుల్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మంగళవారం ఇక్కడ ఏఐసీసీ కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్టీ పటిష్టతపై చర్చించారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఖడ్గే, గాంధీ... నేతలతో సమావేశమై సంస్థను బలోపేతం చేయడం, పార్టీ మద్దతు స్థావరాన్ని విస్తరించడంపై వారి అభిప్రాయాన్ని కోరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. పార్టీ అనేక మంది కొత్త కార్యదర్శులను నియమించిన ప్రధాన సంస్థాగత పునర్వ్యవస్థీకరణ తర్వాత కొన్ని రోజుల తర్వాత సమావేశం జరిగింది. కాంగ్రెస్ ప్రతి భారతీయుడికి చేరువవుతుందని ఖడ్గే 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'కొత్తగా నియమితులైన ఏఐసీసీ కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శుల సమావేశానికి మేము అధ్యక్షత వహించాం. మా సంస్థను బలోపేతం చేయడానికి, ప్రతి గొంతులో పాల్గొనడానికి, అధికారం కోసం నిజం మాట్లాడటానికి నిశ్చయించుకున్నాం' అని కాంగ్రెస్ అధ్యక్షుడు చెప్పారు. ఖడ్గే అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) కార్యదర్శులు, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంయుక్త కార్యదర్శులను నియమించారు. ఈ ఆఫీస్ బేరర్లు ఆయా రాష్ట్రాల్లోని పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌ఛార్జ్‌లతో సంబంధం కలిగి ఉంటారు. కాంగ్రెస్ అధ్యక్షుడి కార్యాలయంలో సమన్వయకర్తలుగా ఉన్న ప్రణవ్ ఝా, గౌరవ్ పాంధీని ఏఐసీసీ కార్యదర్శులుగా నియమించారు. పార్టీ కమ్యూనికేషన్ విభాగంలో ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్న వినీత్ పునియాకు అదే బాధ్యతలు అప్పగించగా, ఆయనతో పాటు ఆ శాఖలో రుచిరా చతుర్వేదిని కార్యదర్శిగా నియమించారు. రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు డానిష్ అబ్రార్, దివ్య మదెర్నా కూడా వరుసగా ఢిల్లీ, జమ్మూకశ్మీర్, లడఖ్‌లకు కార్యదర్శులుగా నియమితులయ్యారు. అఖిల భారత మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు నెట్టా డిసౌజా, ఎన్ఎస్‌యూఐ మాజీ అధ్యక్షుడు నీరజ్ కుందన్, నవీన్ శర్మలు వేణుగోపాల్‌తో పాటు ఏఐసీసీ కార్యదర్శులుగా పని చేయనున్నారు. మనోజ్ త్యాగి, సుశాంత్ మిశ్రాలను పరిపాలనలో సంయుక్త కార్యదర్శులుగా నియమించారు. సంస్థలో పనిచేస్తున్న వారికి, పార్టీకి విధేయత చూపిన వారికి ఈ పదవులు దక్కినట్లు పార్టీ నాయకుడు ఒకరు తెలిపారు. హర్యానా, జమ్మూకశ్మీర్‌లలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ సమావేశం జరిగింది. ఆ తర్వాత ఈ ఏడాది చివరిలో మహారాష్ట్ర, జార్ఖండ్‌లో జరుగుతాయి.

ఆర్ఎస్ఎస్ అనుమతి అవసరమా?

కులగణనపై కాంగ్రెస్ సూటిప్రశ్న

న్యూఢిల్లీ: కులగణనను ఎన్నికల్లో లబ్ధి కోసం రాజకీయ ఉపకరణంగా వినియోగించరాదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఇప్పుడు కులగణనకు ఆర్ఎస్ఎస్ ఆమోదం తెలిపిన తర్వాత ప్రధాని మోదీ ప్రజలకు ఇచ్చిన మరో హామీని దోచుకొని, కులగణనను నిర్వహిస్తారా అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. 'కుల గణనకు అనుమతివ్వడానికి ఆర్ఎస్ఎస్ ఎవరు? ఎన్నికల ప్రచారానికి కుల గణనను దుర్వినియోగం చేయరాదని ఆర్ఎస్ఎస్ చెప్పడం వెనక అర్థం ఏమిటి? ఆ సంస్థ ఏమైనా న్యాయమూర్తి స్థానంలో ఉందా?' అని ఆయన ప్రశ్నించారు. దళితులు, ఆదివాసీలు, ఓబీసీల రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించడానికి రాజ్యాంగ సవరణ చేయాల్సిన అంశంపై ఆర్ఎస్ఎస్ ఇంతకాలంగా ఎందుకు మౌనంగా ఉంటుందని దుయ్యబట్టారు. ఆర్ఎస్ఎస్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే స్పందించారు. 'దేశ రాజ్యాంగానికి బదులు మనుస్మృతికి అనుకూలంగా ఉన్న సంఘ్ పరివార్... దళితులు, గిరిజనులు, వెనకబడిన తరగతులు, పేద-బడుగు బలహీన వర్గాల భాగస్వామ్యం, అభివృద్ధి గురించి ఆలోచిస్తుందా? కులగణనకు తాము అనుకూలమో, వ్యతిరేకమో ఆర్ఎస్ఎస్ దేశానికి స్పష్టంగా చెప్పాలి' అని సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మూడ్రోజులపాటు కేరళలోని పాలక్కడ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి సమన్వయ సమావేశాల్లో భాగంగా ఆ సంస్థ జాతీయస్థాయి ప్రతినిధి సునీల్ అంబేకర్ మీడియాతో మాట్లాడుతూ 'ప్రభుత్వాలు సమాచార అవసరాల కోసం కులగణన చేపట్టవచ్చు. మన సమాజంలో కులాల ప్రతిస్పందనలు చాలా సున్నితమైన అంశాలు. జాతీయ సమగ్రతకు అవి చాలా ముఖ్యం. అయినా... కులగణన సమాచారాన్ని ఎన్నికల ప్రచారాల కోసం వినియోగించకూడదు. సంబంధిత వర్గాల సంక్షేమానికి తప్పకుండా వాడుకోవచ్చు. వీటిని నిర్వహించే క్రమంలో అన్నిపక్షాలు సామాజిక సమగ్రత దెబ్బతినకుండా చూసుకోవాలి' అని పేర్కొన్నారు. అయితే ఇప్పటికే కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, ఇతర ఇండియా ఐక్యసంఘటన మిత్రపక్షాలు దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇటీవల ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి కులగణన ఒక పునాదిగా నిలుస్తుందన్నారు. 90 శాతం మంది దేశ ప్రజల ప్రయోజనాల పరిరక్షణకు కులగణన ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం 10 శాతం మంది మాత్రమే ఈ వ్యవస్థలో లబ్ధి పొందుతున్నారని తెలిపారు. రాజ్యాంగం మాదిరిగానే కులగణన కూడా విధాన నిర్ణయాల రూపకల్పనకు మార్గదర్శిగా నిలుస్తుందన్నారు. ప్రస్తుతం 50 శాతం పరిమితికి మించి రిజర్వేషన్లు పెంచాలంటే కులగణన అవసరమని పేర్కొన్నారు.

విద్యార్థిని వెంటాడి... కాల్చి చంపారు

న్యూఢిల్లీ: హర్యానాలోని ఫరీదాబాద్‌లో 12వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని గో సంరక్షకుల పేరుతో దుండగులు కాల్చి చంపారు. గోవులను అక్రమ రవాణా చేస్తున్నాడన్న ఆరోపణలతో విద్యార్థిపై దాడి చేశారు. ఇటీవల జరిగిన ఈ ఘటనలో గోసంరక్షణ గ్రూపునకు చెందిన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను అనిల్ కౌశిక్, వరుణ్, కృష్ణ, ఆదేశ్, సౌరభ్‌గా, బాధితుడిని ఆర్యన్ మిశ్రాగా గుర్తించారు. మిత్రులు శాంకీ, హర్షిత్‌తో వెళ్తున్న ఆర్యన్‌ను గోవుల అక్రమ రవాణా చేసే వ్యక్తులుగా భావించి... నిందితులు వెంటబడ్డారు. సుమారు 30 కిలోమీటర్ల దూరం కారులో వెంటాడారు. హర్యానాలోని ఢిల్లీ-ఆగ్రా జాతీయ రహదారిపై ఈ ఘటన జరిగింది. రెనాల్ట్ డస్టర్, టొయోటా ఫార్చునర్‌లో కొందరు ఆవులు స్మగ్లింగ్ చేసేవాళ్లు రెక్కీ వేస్తున్నట్లు గో సంరక్షకులకు సమాచారం అందింది. స్మగ్లర్ల కోసం వెతుకుతున్న సమయంలో విద్యార్థులు ప్రయాణిస్తున్న డస్టర్ కారును పటేల్ చౌక్ వద్ద గుర్తించారు. డ్రైవర్ సీటులో ఉన్న హర్షిత్ కారు ఆపలేదు. అయితే నిందితులు ఆ సమయంలో కాల్పులు జరిపారు. ముందు సీటులో కూర్చున్న ఆర్యన్‌కు బుల్లెట్ తగిలింది. కారు ఆగిన తర్వాత కూడా ఆర్యన్‌ను మరోసారి నిందితులు కాల్చారు. కారులో ఇద్దరు మహిళలు ఉన్నట్లు గుర్తించిన నిందితులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఆర్యన్‌ను ఆస్పత్రిగా తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది. నిందితులు వాడిన తుపాకీ అక్రమమైందని తేలింది. పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై ఒత్తిడి తెస్తాం

కులగణనపై లాలూ ప్రసాద్

పాట్నా : కుల గణన అంశంపై బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంపై ముందరి దాడిని ప్రారంభించిన రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ) అధినేత లాలూ ప్రసాద్... విపక్షాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాయని, తద్వారా జనాభా గణనను నిర్వహించాలని ఒత్తిడి తెస్తామని మంగళవారం ప్రకటించారు. సేకరించిన వివరాలు రాజకీయ కారణాలతో కాకుండా నిరుపేదల సంక్షేమం కోసం ఉపయోగిస్తేనే కుల గణనకు మద్దతిస్తామని ఆర్ఎస్ఎస్ చెప్పిన ఒక రోజు తర్వాత ఆయన వ్యాఖ్య చేశారు. 'ఆర్ఎస్ఎస్, బీజేపీ చెవి పట్టుకుని కూర్చునేలా చేస్తాం. కుల గణన చేయిస్తాం... కుల గణన చేయబోమనడానికి వాళ్లకు ఏం అధికారం ఉంది. దళితులు, వెనుకబడినవారు, గిరిజనులు, పేదలు ఐక్యతను ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైంది' అని లాలూ ప్రసాద్ హిందీలో పోస్ట్ చేశారు. సింగపూర్‌లో వైద్య పరీక్షల అనంతరం పాట్నాకు తిరిగి వచ్చిన తర్వాత ఆయన ఈ పోస్ట్ చేశారు. దేశవ్యాప్త కుల గణన, అలాగే బీహార్ ప్రభుత్వం కోటా పెంపును రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ సెప్టెంబరు 1 ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఒకరోజు ధర్నా కార్యక్రమం నిర్వహించింది. పాట్నాలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆర్‌జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలోని జేడీ(యూ) ప్రభుత్వం 'సమాజంలోని అణగారిన వర్గాలకు రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా', కుల జనాభా గణనకు వ్యతిరేకంగా ఉందని విమర్శించారు. బీహార్‌లో అణగారిన కులాల కోసం పెంచిన కోటాను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చడంపై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటును, ప్రజలను తప్పుదోవ పట్టించిందని తెలిపారుఉ.

జైళ్లకు సెల్‌ఫోన్ జామర్లు

బెంగళూరు: జైళ్ల శాఖలో కొందరి నిర్లక్ష్యం, రాజకీయ జోక్యం వంటి కారణాలతో దశాబ్దాలుగా జైళ్లు విలాసవంతమైన ప్రాంతాలుగా మారిపోతున్నాయి. తరచూ జైళ్లలో మొబైల్, మద్యం, గంజాయితోపాటు ఇతరత్రా నిషేధిత వస్తువులు పట్టుబడుతున్నాయి. జైళ్లలో మొబైల్ నెట్‌వర్క్ లేకుండా చేసేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేసినా ఫలించడం లేదు. ఎంతోమంది విచారణ ఖైదీలు, శిక్షకు గురైనవారు మొబైల్ వాడకాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నారు. అక్కడి నుంచే అన్ని వ్యవహారాలు చక్కబెడుతున్నారు. బెంగళూరులోని పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంతోపాటు ఏడు జైళ్లలో టవర్స్ ఆఫ్ ది హార్మోనిస్ సెల్ బ్లాకింగ్ సిస్టమ్ (టి-హెచ్‌సీబీఎస్) టెక్నాలజీకి అనుబంధమైన మొబైల్ టవర్లు ఏర్పాటు చేశారు. వీటి ఐదేళ్ల నిర్వహణకు రూ.11.32 కోట్లు విడుదల చేశారు. ఈ టవర్లు నిర్దేశించిన ప్రదేశంలో మొబైల్ సిగ్నల్స్ లభించకుండా పనిచేస్తాయి. అయినా ఉగ్రవాద కార్యకలాపాలు, సంఘ విద్రోహశక్తులు, హత్యలు వంటి తీవ్రమైన కేసులలో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నవారు స్మార్ట్‌ఫోన్లను యథేచ్ఛగా వాడుతున్నారు. కొందరు జైళ్లలో కూర్చుని బయట వ్యక్తులతో వ్యవహారాలు సాగిస్తున్నారు. మరికొంత మంది బెదిరింపులకు పాల్పడి వసూళ్లు చేస్తున్నారు. పరప్పన అగ్రహార జైలులో హెచ్‌సీబీఎస్ టవర్ల ఏర్పాటుకు ఐదేళ్లకుగాను రూ.4.67 కోట్లు ఖర్చు కానుంది. ఇందుకుగాను మే 2న రూ.2.96 కోట్లు విడుదల చేశారు. చిత్రదుర్గకు చెందిన రేణుకాస్వామి హత్య కేసులో నటుడు దర్శన్‌తోపాటు రౌడీలు మొబైల్ వాడిన ఫొటోలు, వీడియోలు వైరల్ కావడంతో జైళ్లశాఖపై విమర్శలు వెల్లువెత్తాయి. జైళ్లశాఖ డీజీపీ మాలిని కృష్ణమూర్తికి ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. బెంగళూరు పరప్పన జైలుతోపాటు బెళగావి, విజయపుర, ధారవాడ, బళ్లారి, శివమొగ్గ, తుమకూరు సెంట్రల్ జైలుకు మొబైల్ టవర్లు ఏర్పాటు చేశారు. జామర్ సర్వీసులు కొనసాగించేందుకు రిలయెన్స్, జియోకు రూ.86.99 లక్షలు, భారతి ఎయిర్‌టెల్ లిమిటెడ్‌కు రూ.87 లక్షలు, ఒడాఫోన్ - ఐడియా సంస్థకు రూ.57 లక్షలు, 30 కేవీఏ డీజిల్ జనరేటర్లకు రూ.19 లక్షలు ఖర్చు చేశారు. భద్రావతి ఎమ్మెల్యే సంగమేశ్వర్ కుమారుడు బసవరాజ్ హత్యకు జైలులోని ముబారక్ అలియాస్ డిచి ముబారక్ సుపారీ ఇవ్వడం వెలుగు చూసింది. గతంలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరి, మహారాష్ట్రలోని నాగపూర్ కార్యాలయానికి బెళగావిలోని హిండలగా జైలు నుంచి నొటోరియస్ జయేశ్‌పూజారి ఫోన్ చేసి రూ.10 కోట్లు డిమాండ్ చేశారు. జైళ్లశాఖ డీఐజీ టీబీ శేషకు పరప్పన అగ్రహార, బెళగావి జైళ్ల నుంచే క్వార్టర్స్ పేల్చివేస్తామని బెదిరింపులు రావడం, పరప్పన అగ్రహార నుంచి రౌడీ మనోజ్ ఓ యువతికి నగ్న వీడియో పంపి రూ.40 వేలు వసూలు చేయడం వంటివి సంచలనమయ్యాయి. దీంతో జైళ్లశాఖలో మరిన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.

అరేబియా సముద్రంలో కూలిన హెలికాప్టర్

ముంబై: భారత తీర గస్తీ దళానికి చెందిన ఓ తేలికపాటి హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. అత్యవసర ఆపరేషన్‌కు వెళు ండగా అరేబియా సముద్రంపై ఎమర్జెన్సీ ల్యాండ్ అవుతూ కూలిపోయింది. ఈ ఘటనకు సంబంధించి సిబ్బందిలో ఒకరిని కోస్ట్‌గార్డ్ సిబ్బంది రక్షించగా... మరో ముగ్గురు గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. పోర్‌బందర్‌కు 45 కిలోమీటర్ల దూరంలో అరేబియా సముద్రంలో ఉన్న మోటార్ ట్యాంకర్ హరిలీలాలో ఓ సిబ్బందికి తీవ్ర గాయమైంది. దీంతో ఆ ట్యాంకర్ మాస్టర్ నుంచి తీర గస్తీ దళానికి అత్యవసర సందేశం అందింది. గాయపడిన ఆ సిబ్బందిని తరలించేందుకు సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో కోస్ట్‌గార్డ్‌కు చెందిన అధునాతన తేలికపాటి హెలికాప్టర్ బయల్దేరింది. మార్గమధ్యలో ఇందులో సమస్య తలెత్తి సముద్రంపై ఎమర్జెన్సీ ల్యాండ్ అవ్వాల్సి వచ్చింది. దీంతో హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. ఈ ఘటన సమయంలో అందులో నలుగురు సిబ్బంది ఉన్నారు. అప్రమత్తమైన కోస్ట్‌గార్డ్ దళాలు తక్షణమే సహాయక చర్యలు చేపట్టాయి. హెలికాప్టర్ శకలాన్ని గుర్తించి అందులో ఒకరిని కాపాడారు. మరో ముగ్గురు గల్లంతవగా... వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నాలుగు నౌకలు, రెండు విమానాలతో సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు కోస్ట్‌గార్డ్ అధికారులు వెల్లడించారు. ప్రమాదానికి గురైన హెలికాప్టర్ ఇటీవల గుజరాత్ వర్షాల సమయంలో 67 మందిని కాపాడి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

ఐక్య పోరుతో హక్కుల రక్షణ

- నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే
- కనీస వేతనం, పని భద్రత కల్పించాలి
- విశాఖ స్టీల్ రక్షణ బాధ్యత చంద్రబాబుదే!
- విశాఖ బహిరంగ సభలో రామేంద్రకుమార్, అమర్‌జిత్ కౌర్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: దేశంలోని అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి ప్రజాకంటక పాలన సాగిస్తున్న మోదీ విధానాలపై, కార్మిక హక్కుల పరిరక్షణ, చట్టాల అమలుకు ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని ఏఐటీయూసీ అధ్యక్షులు రామేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి అమరజిత్ కౌర్ పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్ సిటీలో మూడు రోజుల పాటు జరిగిన ఏఐటీయూసీ జాతీయ కౌన్సిల్ సమావేశాలు మంగళవారం సాయంత్రం విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా విశాఖ నగరంలో కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గ్రేటర్ విశాఖ కార్యాలయం వద్ద ఏఐటీయూసి రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో వారిద్దరూ ఉత్తేజకర ప్రసంగం చేశారు. విశాఖ నగరానికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉందని, ఇక్కడి ఉక్కు పరిశ్రమకు దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందని వారు గుర్తు చేశారు. విశాఖ స్టీల్ దేశంలోనే అత్యుత్తమైనదని పేర్కొన్నారు. వేలాది మంది కార్మికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది ఉపాధికి దోహదపడే విశాఖ ఉక్కు పరిశ్రమను మోదీ ప్రభుత్వం కారుచౌకగా తన మిత్రుడు అదానికి కట్టబెట్టాలని చూస్తున్నదన్నారు. ప్రస్తుతం దేశంలో మోదీ మైనార్టీ ప్రభుత్వం రెండు పిల్లర్ల మీద కొనసాగుతోందన్నారు. ముఖ్యంగా ఈ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి ఎన్‌డీఏకి అండగా నిలబడ్డారన్నారు. ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబుకు దాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. రాష్ట్రానికి మంచి ప్యాకేజీ ఇచ్చారని మోదీని పొగుడుతున్న చంద్రబాబు... స్టీల్ ప్లాంట్ గురించి ఎందుకు ప్రస్తావించడం లేదని ప్రశ్నించారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని, సెయిల్ లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. దీనిని కాపాడుకోవడానికి ఏఐటీయూసీ మిగిలిన కార్మిక సంఘాలను కలుపుకుని ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉంటుందని వారు స్పష్టం చేశారు. మోదీ అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించారని, చిన్న వ్యాపారాలు, ఉత్పాదక యూనిట్లు, ట్రేడ్ లు, దాదాపు 40 శాతం స్టార్టప్ లు మూసివేతకు గురవ్వడంతో ఆర్థిక వ్యవస్థ దివాలా స్థితికి చేరిందన్నారు. దీని వల్ల నిరుద్యోగ సమస్య కూడా తీవ్ర రూపందాల్చిందన్నారు. ఇటీవల ఒక నివేదక ప్రకారం బీజేపీ పదేళ్ల పాలనలో 18 లక్షల పారిశ్రామిక యూనిట్‌లు మూతపడి ఉద్యోగులు రోడ్డున పడ్డారని వారు వెల్లడించారు. ఉత్పాదక రంగమే కాకుండా సేవా రంగంలో కూడా భారీగా ఉద్యోగాలు కోల్పోయారన్నారు. మరో పక్క నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలను అదుపు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందడంతో పేద మధ్యతరగతి వర్గాలు తీవ్ర ఆర్థిక ఇక్కట్లకు లోనవుతున్నారని పేర్కొన్నారు. ఇంకో వైపు దేశంలో 55 శాతం జనాభా అర్ధాకలిలో పస్తులు గడుపుతున్నారని, వీరిలో అత్యధికులు అసంఘటిత కార్మికులు, వ్యవసాయ కూలీలు, సన్న చిన్న కారు రైతులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారత ఆహార భద్రతపై ఐక్య రాజ్య సమితి నివేదికలో ఈ విషయం పొందుపరిచిందని, దీనికి మోదీ ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. నిరుద్యోగ సమస్య రోజురోజుకు తీవ్రంగా పెరుగుతుండడంతో యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో 90 శాతం కుటుంబాలు పది వేల కంటే సంపాదన తక్కువ కల్గి ఉండగా, 80 కోట్ల మంది ప్రజలకు ఐదు కిలోల ఉచిత రేషన్ ఇస్తున్నామని కేంద్రం డాంబికాలు పలుకుతోందని విమర్శించారు. కార్మిక సంస్కరణల పేరుతో చట్టబద్ధమైన కార్మిక ప్రమాణాలను, ఐక్యరాజ్య సమితి కట్టుబాట్లను, ఒప్పందాలను, శాసన ప్రక్రియలను తుంగలో తొక్కి చట్టాల నిబంధనలను నిర్వీర్యం చేసిందన్నారు. కరోనా కాలంలో దాదాపు 25 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను కనీసం చర్చ లేకుండానే పార్లమెంట్‌లో ఆమోదించారని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా చేసిన ఆ లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలందరికీ ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా కనీస పెన్షన్ 9వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఒక పక్క పేదరికం, నిరుద్యోగ సమస్య, పౌష్టికాహార లోపం, ఆత్మహత్యలు పెరుగుతుండగా, మరో పక్క కార్పొరేట్లు కోట్లకు పడగలు ఎత్తుతున్నారని వారు దుయ్యబట్టారు. ఇటీవలే హిండెన్ బర్గ్ నివేదిక బహిర్గతం చేసినట్లుగా మోదీ క్రోనీ క్యాపిటలిజం కార్పొరేట్ మిత్రులు ప్రభుత్వ రంగానికి చెందిన ఆస్తులపై కన్నేశారని పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కూడా కార్పొరేట్ స్నేహితులకు అనుకూలంగా ఉందని విమర్శించారు. ఇలా మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాబోయే కాలంలో సంఘటిత ఉద్యమాల నిర్వహణకు, ట్రేడ్ యూనియన్ల, శ్రామికవర్గ ఐక్యతకు పాటుపడాలని వారు పిలుపునిచ్చారు. ఈ సభలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, విశాఖ స్టీల్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి ఆదినారాయణ, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు విద్యాసాగర్, ఏఐటీయూసీ కేరళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేపీ రాజేంద్రన్, ఏఐటీయూసీ తమిళనాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూర్తి, కర్నాటక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్, తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు యూసఫ్, విశాఖ స్టీల్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కెఎస్‌ఎన్ రావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ తదితరులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి అచ్యుతరావు స్వాగతం పలకగా, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకట సుబ్బయ్య వందన సమర్పణ చేశారు.

భద్రత కోసం కార్మికులు పోరాడాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ ఎస్ మూర్తి

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: పని ప్రదేశాలలో కార్మికులకు భద్రత ఉండడం లేదని, దీని కోసం కార్మికులు పోరాడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ సమావేశాల ముగింపు సందర్భంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమల శాఖల అధికారులు, కంపెనీ యజమానులతో కుమ్మక్కై, పని ప్రదేశాల్లో కార్మికుల భద్రత గురించి పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫలితంగా ప్రమాదాలు సంభవించి అనేక మంది కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఎసెన్షియా ఫార్మా, సినర్జిన్ ఫార్మా కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో కార్మికులు మరణించారని, వారి కుటుంబాలకు కోటి రూపాయలు చొప్పున నష్టపరిహారం ప్రకటించారని, అయితే వారు లేని లోటు కుటుంబ సభ్యులకు తీర్చలేనిదని అన్నారు. అసంఘటితరంగ కార్మికుల హక్కుల కోసం పోరాడాలని, వారికి నెలకు కచ్చితంగా 26 రోజులు పని దొరికేలా చూడాలని డిమాండ్ చేశారు. ఎసెన్షియ ఫార్మా ప్రమాద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, గత ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రమాదాలు గురించి చెప్పారని, ఆయన అధికారం లో ఉన్న 2014 - 2019 మధ్య జరిగిన ప్రమాదాల్లో 27 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేస్తూ అప్పుడు ఏమి చేశారని ప్రశ్నించారు. నరసరావుపేటలో బేవరేజెస్ కార్మికుల్లో డిగ్రీ, పీజీ చదివిన వారు ఉన్నారని, దీన్ని బట్టి నిరుద్యోగం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. రాష్ట్రంలో 10 ఏళ్లుగా కనీస వేతన సలహా మండలి లేదని, ఒక పక్క ధరలు పెరుగుతున్నా కార్మికులకు తగిన వేతనాలు రావడం లేదని అన్నారు. అసంఘటిత రంగ కార్మికులు పోరాటాల ద్వారానే పని ప్రదేశాల్లో భద్రత, పనికి తగ్గ వేతనాన్ని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో పనిచేస్తున్న అసంఘటితరంగ కార్మికులకు కనీస వేతనం నిర్ణయించి దశాబ్ద కాలం అయిందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ, కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ విధానాలను విమర్శించారు. సంఘటిత పోరాటాల ద్వారానే హక్కులను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూసఫ్ మాట్లాడుతూ తెలంగాణలో ప్రభుత్వం కనీస వేతన బోర్డును ఏర్పాటు చేయకపోవడంతో కోర్టు ఉత్తర్వులతో బోర్డు ఏర్పాటు చేయించుకున్నామని తెలిపారు. రెండోసారి కూడా పోరాటం ద్వారానే కనీస వేతన బోర్డు ఏర్పాటైందని, ఫలితంగా ఐదు జీవోలు వచ్చాయని వాటిని ప్రభుత్వం అమలు చేయకపోవడంతో కోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కనీస వేతన బోర్డుకు సభ్యులను ప్రతిపాదించాలని కోరినట్లు తెలిపారు.

ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణే వికసిత్ భారతా?

ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: కేంద్రానికి ఏటా లక్షల కోట్ల రూపాయలు ఇస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ఒక పక్క ప్రైవేటుపరం చేస్తూ వికసిత భారత్ అంటూ ప్రధాని నరేంద్ర మోడీ ఊదరగొట్టడం విడ్డూరంగా ఉందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు అన్నారు. ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ సమావేశాల ముగింపు సందర్భంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌కి సొంత గనులు ఇవ్వకుండా బ్యాంకు రుణాలకు అడ్డుపడుతూ ఖాయిలా పరిశ్రమగా మార్చి ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని, ఇది కేవలం కార్మికులకు సంబంధించిన అంశంగా కాకుండా ప్రజలందరి డిమాండ్‌గా ఉండాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వస్తే స్టీల్ ప్లాంట్‌ని నిలబెడతానన్న చంద్రబాబు.. దాని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాట్లాడిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కేంద్రంతో దీనిపై పోరాడాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై గత ముఖ్యమంత్రి జగన్ దొంగాట ఆడారని విమర్శించారు. గతంలో కేవలం 15వేల కోట్ల అధిపతిగా ఉన్న ఆదాని మోదీ ప్రధాని అయిన తర్వాత గత పదేళ్ల వ్యవధిలో ప్రపంచ కుబేరుల జాబితాలో రెండవ స్థానానికి, దేశంలో నంబర్ వన్ స్థానానికి ఎదిగారని అన్నారు. పేదలపై పన్నులు వేస్తూ సంపన్నులకు రాయితీలు ఇస్తున్నారని దుయ్యబట్టారు. కార్పొరేట్ల సంపదను ఉత్పత్తి కారకులైన పేదలకే పంపిణీ చేయాలని ఓబులేసు డిమాండ్ చేశారు.

బుల్డోజర్ న్యాయంపై
సుప్రీం తీర్పు హర్షణీయం: సీపీఐ

న్యూదిల్లీ: విచక్షణారహితంగా బుల్డోజర్ ఉపయోగించడాన్ని నిలిపివేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) స్వాగతించింది. ఈ మేరకు సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటన ఇలావుంది. నేరానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల ఆస్తులను కూల్చివేసేందుకు బుల్డోజర్లను విచక్షణారహితంగా ఉపయోగించడాన్ని నిలిపివేయాలని గౌరవనీయమైన సుప్రీంకోర్టు ప్రభుత్వాధికారులను సోమవారం ఆదేశించింది. ఈ నిర్ణయం స్వాగతించతగ్గది. న్యాయబద్ధమైన ప్రక్రియననుసరించి దోషిగా రుజువైన నేరస్థుడిని శిక్షించడం న్యాయస్థానాల బాధ్యత. సుప్రీం కోర్టు నిర్ణయాన్ని అమలుపరచడం ప్రభుత్వాల బాధ్యత. ఏ విధమైన చట్టపరమైన విధానాన్ని అనుసరించకుండా ప్రభుత్వాధికారులు నిందితుడైన లేదా దోషి అని తేలిన వ్యక్తి ఆస్తులను కూల్చివేతను శిక్షగా అమలుచేయజాలరని ఆ ప్రకటన పేర్కొన్నది. చట్ట, న్యాయ ప్రక్రియను నిలబెట్టడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతని సీపీఐ తెలిపింది. కేంద్రంలో నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను ముఖ్యంగా మైనారిటీ వర్గాలను, ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేయడానికి రాజ్యాధికారాన్ని ఉపయోగిస్తోందని విమర్శించింది. ఆ విధంగా ఉపయోగించడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేసింది. సుప్రీంకోర్టు నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వాలన్నీ కట్టుబడివుంటాయని ఆశిస్తున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం ఆ ప్రకటనలో పేర్కొంది. తప్పుచేశారనే పేరుతో ఇళ్లు లేదా దుకాణాలను కూల్చివేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను దేశ సర్వోన్నత న్యాయస్థానం సోమవారం విచారించింది. కేసు తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది. సీపీఐ ప్రజాసంఘమైన భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) కూడా బుల్డోజర్ న్యాయాన్ని వ్యతిరేకిస్తూ పిటిషన్ దాఖలు చేసింది.

ముంపు ప్రాంతాల్లో డీజీపీ పర్యటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో డీజీపీ ద్వారకా తిరుమలరావు మంగళవారం పర్యటించారు. ఎడతెరిపిలేని వర్షాలు... వరదలు సృష్టించిన బీభత్సానికి ఆపదలో ఉన్న ప్రజలకు పోలీసులు అందిస్తున్న సేవలను ఆయన పరిశీలించారు. అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో సహాయ కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించారు. విజయవాడ పట్టణ పరిధిలోని అజిత్‌సింగ్ నగర్ పరిసర ప్రాంతాల్లో నీట మునిగిన ప్రాంతాల్లోకి డీజీపీ స్వయంగా వెళ్లి అధికారులకు తగిన సూచనలు చేశారు. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించే అంశంలో పోలీసు, రెవెన్యూ, నీటి పారుదల శాఖలు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ పర్యటనల్లో పోలీసు అధికారులు హేమచంద్ర లడ్హ, ఆర్‌కే మీనా, వినీత్ బ్రిజ్‌లాల్ పాల్గొన్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం : హోం మంత్రి అనిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వర్షాభావ స్థితిగతుల నుంచి సాధారణ పరిస్థితులకు చేరే వరకూ ప్రభుత్వం వరద బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత హామీ ఇచ్చారు. ఆకలిదప్పులకు ఆస్కారం లేకుండా ప్రతి ఒక్కరినీ కాపాడుకుంటామని ఆమె స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం నుంచే భవనీపురం లలితానగర్ ప్రాంతంలో ముంపు ప్రాంతంలోని ప్రజలకు ఆహార పొట్లాలు, నీరు పంపిణీ చేశారు. మోకాళ్లలోతు పైన ఇంకా నీరు నిలిచి ఉండడంతో ట్రాక్టర్ పైన ప్రయాణం చేసి ఆ కాలనీ వాసులకు ఆహారం అందజేశారు. చిన్నారులు, మహిళలు, ప్రత్యేక ఇబ్బందికర పరిస్థితులున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు ముందుచూపు, అనుభవంతో ప్రాణ నష్టం లేకుండా బయటపడగలిగామన్నారు. నీరు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి డ్రోన్లు, హెలికాప్టర్ల ద్వారా ఆహారం అందించడంపైన ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. ఆమెతో పాటు గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా పాల్గొన్నారు.

డ్రోన్ల సాయంతో ముంపు బాధితుల గుర్తింపు- మంత్రి సవిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : డ్రోన్ల సహాయంతో ముంపు బాధితులను గుర్తించి, ఆ తర్వాత సహాయక చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర చేనేత, జౌళి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత చెప్పారు. మంగళవారం ఎన్టీఆర్‌జిల్లా కలెక్టరేట్లో ఆమె విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నిరంతరం అధికారులకు మార్గనిర్దేశం చేస్తూ సహాయక చర్యలు సజావుగా సాగేలా ముందుకు నడుపుతున్నారని చెప్పారు. ప్రజలకు అవసరమైన మినరల్ వాటర్, ఆహార ప్యాకెట్లను యుద్ధ ప్రాతిపదికన శరవేగంగా అందిస్తున్నామన్నారు. మందులను డ్రోన్ల సహాయంతో ముంపు బాధితులకు అందిస్తున్నామని, ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షితంగా ఉండేలా ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు పకడ్బందీగా తీసుకుంటున్నామని చెప్పారు. కొత్త మార్గాలను అన్వేషించి ఆయా ప్రాంతాలకు ఏదో ఒక విధంగా చేరి ప్రజలకు సహాయ సహకారాలు ప్రభుత్వం అందిస్తోందన్నారు. డివిజన్ల వారీగా మంత్రులు, ప్రజాప్రతినిధులకు సీఎం చంద్రబాబు బాధ్యతలు అప్పగించారని, వారి ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ బాధితులకు భరోసా కల్పిస్తూ సహాయక చర్యలు చేపడుతోందన్నారు. బాధితులకు ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా చేయాల్సిందంతా చేస్తున్నామని, వారు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా సురక్షితంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

సెబీ చైర్‌పర్సన్ వివాదం...
జీతం కంటే ఎక్కువిస్తారా?

ఐసీఐసీఐ బ్యాంక్‌కు కాంగ్రెస్ ప్రశ్నల వర్షం

న్యూదిల్లీ: సెబీ చైర్‌పర్సన్ మాధవీ పురి బుచ్ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రశ్నలు లేవనెత్తింది. మాధవికి తాము ఎలాంటి వేతనమూ చెల్లించడం లేదంటూ ఐసీఐసీఐ బ్యాంక్ ఇచ్చిన వివరణపై మరిన్ని ప్రశ్నలు సంధించింది. ఆమెకు పదవీ విరమణ ప్రయోజనాలు మాత్రమే చెల్లిస్తున్నామని చెబుతున్న బ్యాంక్... ఆ మొత్తం జీతం కంటే ఎక్కువ ఎలా ఉంటుందని ప్రశ్నించింది. మధ్యలో ఏడాది పాటు ఎలాంటి ప్రయోజనాలు ఇవ్వకపోవడాన్ని నిలదీసింది. సెబీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మాధవీ పురి బుచ్‌కు ఐసీఐసీఐ బ్యాంకు నుంచి జీతభత్యాలు అందుతున్నాయంటూ సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. 2017లో ఆమె సెబీలో చేరినప్పటి నుంచి ఇప్పటివరకు ఐసీఐసీఐ బ్యాంకు అధికారి హోదాలో రూ.16.08 కోట్లు అందుకున్నారని, ఇదే కాలంలో సెబీ నుంచి ఆమెకు అందింది కేవలం రూ.3.3 కోట్లని కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేడా ఆరోపించారు. దీనిపై స్పందించిన ఐసీఐసీఐ బ్యాంక్... తాము ఎలాంటి వేతనం చెల్లించడం లేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో పవన్‌ఖేడా మంగళవారం మరోసారి మీడియా సమావేశం నిర్వహించారు. మాధవికి చెల్లిస్తోంది కేవలం పదవీ విరమణ ప్రయోజనాలేనని బ్యాంక్ చెబుతోందని, మరి ఆ మొత్తం ఎందుకు జీతం కంటే ఎక్కువ ఉందని పవన్ ఖేడా ప్రశ్నించారు. 'ఆమె పదవీ విరమణ చేసిన అనంతరం 2014-15లో ఐసీఐసీఐ బ్యాంక్ పదవీ విరమణ ప్రయోజనాల్లో భాగంగా రూ.5.03 కోట్లు చెల్లించారు. మధ్యలో 2015-2016లో ఎందుకు చెల్లించలేదు? మళ్లీ 2016 నుంచి 2021 వరకు మాత్రమే ఎందుకు చెల్లింపులు చేపట్టారు?' అని నిలదీశారు. 2007 నుంచి 2013-14 వరకు ఆమె సగటు వేతనం రూ.1.3 కోట్లు కాగా... 2016-17 నుంచి 2020-21 వరకు ఆమెకు పదవీ విరమణ ప్రయోజనాల కింద సగటున ఏటా రూ.2.77 కోట్లు ఎలా చెల్లించారని, జీతం కంటే ప్రయోజనాలు ఎక్కడైనా ఎక్కువ ఉంటాయా అని ప్రశ్నించారు. ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన వాళ్లు ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్లను పదేళ్ల వరకు ఎప్పుడైనా వినియోగించుకోవచ్చని ఐసీఐసీఐ బ్యాంక్ సోమవారం తన వివరణలో పేర్కొంది.

'పోలీస్ వారి హెచ్చరిక'

ఫస్ట్ లుక్ ఆవిష్కరించిన హీరో శ్రీకాంత్

అభ్యుదయ దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో తూలిక తనిష్క్ క్రియేషన్స్ పతాకంపై బెల్లి జనార్ధన్ నిర్మిస్తున్న 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రం ఫస్ట్ లుక్‌ను హీరో శ్రీకాంత్ తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ 'టైటిల్ ఎంత ఆకర్షణీయంగా ఉందో ఫస్ట్ లుక్ కూడా అంతే ఆకర్షణీయంగా ఉంది. ఎవరినైనా తాళ్లతోనో, సంకెళ్లతోనో కట్టి బంధిస్తారు. కానీ ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ఒక పోలీస్‌ను తుపాకులతో కట్టి బంధించడం నిజంగా కొత్తగా ఉంది. ఎప్పుడూ కొత్త కథలు, ఆలోచనలతో అడుగులేసే దర్శకుడు బాబ్జీ ఈ సినిమాతో మంచి సక్సెస్ సాధిస్తాడని నాకు గట్టి నమ్మకం ఉంది' అని తెలిపారు. దర్శకుడు బాబ్జీ మాట్లాడుతూ సినీ పరిశ్రమలో నేను అన్నయ్య అని పిలిచేది హీరో శ్రీకాంత్ గారిని మాత్రమేనని, మంచి మనసున్న శ్రీకాంత్ గారి చేతులమీదుగా ఫస్ట్ లుక్‌ను విడుదలగావించుకున్న మా 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రాన్ని మంచి మనసున్న ప్రేక్షక మహాశయులు గొప్పగా ఆదరిస్తారనే నమ్మకం తమకుందని అన్నారు. నిర్మాత బెల్లి జనార్ధన్ మాట్లాడుతూ 'ఎప్పటికైనా హీరో శ్రీకాంత్ గారితో ఒక ఫొటో దిగాలనుకున్నాను. అటువంటిది ఈ రోజు నా సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌నే ఆయన ఆవిష్కరించడం నేను చేసుకున్న అదృష్టం' అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర కథానాయకుడు సన్నీ అఖిల్, నటి జయ వాహిని, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రంలో సన్నీ అఖిల్, గిడ్డేష్ , అజయ్ ఘోష్ , రవి కాలే , షియాజీ షిండే, శుభలేఖ సుధాకర్, కాశీ విశ్వనాథ్ , జబర్దస్త్ వినోద్, జబర్దస్త్ పవన్, హిమజ, జయ వాహిని, మేఘనా ఖుషి, శంకరాభరణం తులసి తదితరులు చిత్ర తారాగణం కాగా, సంగీతం : గజ్వేల్ వేణు, కెమెరా : కిషన్ సాగర్, కె.నళినీ కాంత్, ఎడిటింగ్ : శివ శర్వాణి, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ : ఎస్.హనుమంత రావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ : ఎస్.పి.సుబ్బారాయుడు, నిర్మాత : బెల్లి జనార్ధన్, రచన, దర్శకత్వం : బాబ్జీ.

ముంపు బాధితులకు సీపీఐ, ఎస్‌ఎఫ్ ఆహారం పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ(ఒన్‌టౌన్): సీపీఐ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లోని వరద ముంపు బాధితులకు ఆహార పొట్లాలు , మంచినీటి బాటిళ్లు పంపిణీ చేశారు. పాత రాజరాజేశ్వరీపేటలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి డి. శంకర్ నాయకత్వంలో బృందం వరద సహాయక చర్యల్లో పాల్గొని బాధితులకు వాటర్ బాటిళ్లు అందజేసింది. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, డీహెచ్‌పీఎస్‌రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు లంకా గోవిందరాజులు, సీపీఐ నాయకులు సంగుల పేరయ్య, జల్దీ చిన్నా తదితరులు పాల్గొన్నారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్‌బాబు తదితరులు బాధితులకు ఆహార పొట్లాలను అందజేశారు. సితార సెంటర్ నుంచి ప్రతి ఇంటికీ సీపీఐ, ఏఐఎస్ఎఫ్ శ్రేణులు వెళ్లి ఆహారం ఇచ్చారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్, విజయవాడ నగర పార్టీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు ఇవ్వండి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరద బాధితులకు విరాళాలిచ్చి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. మంచి మనసుతో ముందుకు రావాలని, ఎవరికి తోచిన విధంగా వారు స్వచ్ఛందంగా ముందుకు రావాలని సీఎం చంద్రబాబు కోరారు. బాధితులకు ఏ రూపంలోనైనా సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛందంగా ఆహారం ఇవ్వదలచిన దాతల కోసం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రత్యేక పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఆహారం అందించే దాతలను సమన్వయం చేసుకునే బాధ్యతను ఐఏఎస్ అధికారి మనజీర్‌కు సీఎం అప్పగించారు. దాతలకు మరింత సమాచారం అందించేందుకు 79067 96105 నంబరును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ నంబరును సంప్రదించి ఆన్‌లైన్ చెల్లింపులు చేపట్టాలని కోరింది.

సురక్షిత ప్రాంతాలకు 154 మంది గర్భిణులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరద ముంపు కారణంగా 154 మంది గర్భిణులను వైద్యారోగ్య శాఖ సురక్షిత ప్రాంతాలకు చేర్చిందని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలకు అత్యవసర ఆరోగ్య సేవలు అందించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. పునరావాస కేంద్రాలకు అనుబంధంగా 14 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించడంతో పాటు వీటికి అదనంగా 20 సంచార వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు 17,538 మంది రోగులు అందుకున్నారని తెలిపారు. విజయవాడ నగరంలో వివిధ ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకోవడంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి తగిన వసతులు కల్పించిందని పేర్కొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.